సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
శుక్రవారం, 20.03.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 148
పేజీలు: 12 వెల: రూ. 5

## సాదా బైనామా భూములకు పరిష్కారం

**ఉగాది వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి**

వ్యవసాయాన్ని లాభసాటిగా చేసి రైతును రాజుగా చేస్తాం 09

ఈ నెల 22 నుంచి రైతు భరోసా అందిస్తాం





భూ భారతితో సమస్యలకు పరిష్కారం చూపుతున్నాం

తెలంగాణలో దేశంలోనే అతితక్కువ రుణభారం ఉన్న రైతులు

## రూ.3.26 లక్షల కోట్లతో
# రాష్ట్ర బడ్జెట్!?

నేడు అసెంబ్లీ, మండలిలో ప్రవేశపెట్టనున్న భట్టి, శ్రీధర్ బాబు

- సంక్షేమం-వ్యవసాయం-నీటి పారుదలపై సర్కార్ ప్రధాన దృష్టి
- విజన్-2047 అమలుకు ప్రత్యేక నిధులతో దీర్ఘకాల ప్రణాళిక
- ఎన్నికల హామీల అమలే బడ్జెట్‌కు కీలక ఆధారం
- రైతు భరోసా, రైతు బీమా, బోనస్‌లకు భారీ కేటాయింపులు
- పెద్ద ఎత్తున సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా సంక్షేమానికి ప్రాధాన్యత
- విద్య, యువత, ఈవీ స్కూటీల హామీలకు బడ్జెట్‌లో చోటు
- పీఆర్సీ, డీఏలు, పెండింగ్ బకాయిల చెల్లింపులపై ఫోకస్
- కేంద్ర పథకాల మ్యాచింగ్ గ్రాంట్లతో నిధుల వినియోగం పెంపు


### రూ.3.26 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌కు కేబినెట్ ఆమోదం సిద్ధం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్ర బడ్జెట్ ఖరారైంది.. ఆమోదానికి సమయం ఆసన్నమైంది. శాఖల వారీగా సమీక్షలు.. సమావేశాలు నిర్వహించిన ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క కీలక శాఖల నుంచి అవసరమైన నిధుల ప్రతిపాదనలు తెప్పించుకున్నారు. సుదీర్ఘ కసరత్తు తర్వాత మొత్తం రూ.3.26 లక్షల కోట్లతో పద్దును ప్రవేశపెట్టేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం.. ప్రధానంగా సంక్షేమం, వ్యవసాయం, నీటి పారుదల రంగాలపై దృష్టి పెట్టినట్లు సమాచారం. మరోవైపు.. తెలంగాణ విజన్-2047 డాక్యుమెంట్‌లోని అంశాలపై ప్రత్యేక నిధులు కేటాయించనుంది. నేడు ఉదయం తెలంగాణ కేబినెట్ భేటీ అయి.. బడ్జెట్‌కు ఆమోదం తెలపనుంది. తర్వాత మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో.. మంత్రి శ్రీధర్ బాబు మండలిలో ప్రవేశపెట్టనున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా.. ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేసేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ చర్యలు చేపట్టింది. ఈ ఏడాది బడ్జెట్ రూ.3.26 లక్షల కోట్లు ఉండొచ్చని అధికారిక వర్గాల నుంచి విశ్వసనీయంగా తెలిసింది.

**హామీల అమలు దిశగా కేటాయింపులు**


ఎన్నికల ముందు, తర్వాత రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను మిగతా 02లో




# అప్పుల కుంపటి

**వదలని కేసీఆర్ కథ**

- బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ దాకా
- రేవంత్ దీ అప్పుల బాటే
- ప్రాజెక్టులు, సంక్షేమ పద్దులకే ప్రాధాన్యం
- నేడు రాష్ట్ర బడ్జెట్
- ఈసారి అప్పు కోసమే ఎదురుచూపు
- కేంద్ర మ్యాచింగ్ గ్రాంట్లపై చూపు




**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

నేడు రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇప్పటికే బడ్జెట్ ప్రతిపాదనలను సిద్ధం చేశారు. రాష్ట్ర బడ్జెట్ నేపథ్యంలో ప్రభుత్వ అప్పుల విషయంలో మరోసారి పెద్ద చర్చ మొదలైంది. గతంలో భారీగా అప్పులు చేశారని విమర్శలు ఎదుర్కొన్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రభుత్వంతో పోల్చితే సీఎం రేవంత్ రెడ్డి సర్కారు కూడా అదే బాటలో నడుస్తున్నదనే అభిప్రాయాలను ఆర్థిక విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. మిగతా 02లో

## వందేమాతరం పాడాల్సిందే

**కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్**

పాడకుంటే లేదంటే లోపలేస్తాం
జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎంఐఎం అరాచకాలను ఎండగడతాం
రైతు సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వానిది ద్వంద్వ నీతి
రైతు కూలీలు, కౌలు రైతులకు పెట్టుబడి సాయం ఏమైందీ..? 03



## త్వరలోనే 'తెలంగాణ ప్రజా జాగృతి'

**కవితకు న్యాయపరమైన ఊరట**



- కొత్త పార్టీపై ఢిల్లీ హైకోర్టులో ఊరట
- పార్టీ అంశంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఈసీకి ఆదేశాలు
- పార్టీ రిజిస్ట్రేషన్‌లో జాప్యంపై ఆగ్రహం
- ఈసీకి త్వరిత నిర్ణయ సూచన
- 'ప్రజా జాగృతి'కి గ్రీన్ సిగ్నల్ దిశగా అడుగు 09

## ఖతర్, సౌదీపై ఇరాన్ దాడి

**భారత్‌కు మరిన్ని కష్టాలు!**



- భారత ఇంధన భద్రతకు గండం
- ఖతర్ రాస్ లఫన్‌పై ప్రభావం..
- గ్యాస్ సరఫరాలో అంతరాయ భయం
- సౌదీ అరామ్‌కో టార్గెట్..
- చమురు ధరల్లో అలజడి
- గ్యాస్ కొరతతో విద్యుత్, ఎరువుల రంగాలకు దెబ్బ 10

## 'మాయి ముంత' అద్భుతం

- పెద్దింటి రచనలు కదిలించేలా ఉన్నాయి
- అశోక్ కుమార్ కథల సంపుటిపై కేటీఆర్ స్పందన
- రచయితను అభినందిస్తూ సోషల్ మీడియాలో పోస్టు 03

## మళ్లీ కేబినెట్ విస్తరణ?

**పండుగ వేళ కొత్త కథ**

- ఈసారి ఆశావాహులు ఎందరో
- ఇప్పటికే అధిష్ఠానం దగ్గర పంచాయతీ
- సీఎం రేవంత్ రెడ్డి దృష్టిలో ఎవరున్నారో?
- అసెంబ్లీ తర్వాతే క్లారిటీ



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్ర కేబినెట్‌లో మళ్లీ మార్పుచేర్పుల గుసగుసలు మొదలయ్యాయి. ఉగాది పండుగ వేళ.. కొత్త ప్రచారం మొదలైంది. ఢిల్లీ పర్యటనలో రాహుల్ దగ్గర నుంచి రేవంత్ అనుమతి తెచ్చుకున్నారని చెబుతున్నారు. మంత్రివర్గంలో మార్పు చేర్పులు చేయాలని సీఎం రేవంత్ పట్టుదలగా ఉన్నారు. దీని కోసం హైకమాండ్ అనుమతి కోసం ప్రయత్నిస్తున్నారు. రాహుల్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారా లేదా అన్నదానిపై స్పష్టత లేదు. హైకమాండ్ వద్ద రేవంత్ కు ఉన్న పలుకుబడిని బట్టి చూస్తే.. అనుమతి లభించే అవకాశం ఉందని అనుకోవచ్చు. మిగతా 02లో

## అట్టహాసంగా గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రధానోత్సవం 09

**సీఎం రేవంత్ రెడ్డి, భట్టి చేతుల మీదుగా అందజేత**

- హైటెక్స్‌లో సినీ తారల సందడి.. కమల్ హాసన్ ముఖ్య అతిథి
- విజేతలకు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాల ప్రదానం
- జ్యూరీ సభ్యులకు గోల్డెన్ మెమెంటో, లక్ష నగదు బహుమతి






## రైతు భరోసా ట్విస్ట్

**భూమి ఎంత ఉన్నా.. మొదటి విడతలో ఎకరాకే నిధులు!**

- ఎకరానికి రూ.6 వేల జమతో కొత్త విధానం అమలు
- విడతల ఆలస్యం ఇక లేదు.. సర్కార్ కీలక నిర్ణయం
- 70 లక్షల రైతుల ఖాతాల్లో ఒకేసారి డబ్బులు
- మూడు విడతల్లో పూర్తి చెల్లింపు.. స్పష్టమైన షెడ్యూల్
- అర్హతల ఆధారంగా జమ.. కొత్త మార్గదర్శకాలు సిద్ధం
- కొత్త దరఖాస్తులకు అవకాశం.. 25లోపు అప్లయ్ చేయండి
- పంపిణీ లో ఈసారి కీలక మార్పులు




**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ఎట్టకేలకు రైతుల నిరీక్షణ ఫలించింది. రైతు భరోసా నిధుల జమకు ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. ఇదే సమయంలో నిధుల విడుదలలో కీలక మార్పులు చేసింది. ఈ సారి నిధుల విషయంలో అర్హతల ఆధారంగా జమ అవుతాయని స్పష్టం చేస్తున్నారు. అదే విధంగా ఈ సారి తొలి విడతలోనే రైతులందరీ అకౌంట్లో డబ్బులు పడేలా కొత్త నిర్ణయం అమలు చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం తుది కసరత్తు చేస్తోంది. తెలంగాణలో రైతులకు రైతు భరోసా నిధుల విడుదలకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ సారి రైతు భరోసా నిధుల మిగతా 02లో

## తెలుగు లోగిళ్లలో నవ వసంతం

ప్రముఖుల ఉగాది శుభాకాంక్షలు 03








సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 20.03.2026
www.mudranews.in | @mudranews



## స్పష్టమైన లక్ష్యం పెట్టుకోండి




ఏ రంగంలో ఉద్యోగం కావాలో ముందే నిర్ణయించుకోండి. లక్ష్యం స్పష్టంగా ఉంటే ప్రయత్నాలు సరిగ్గా దిశలో సాగుతాయి.

# అప్పుల కుంపటి




(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్ తన తొమ్మిదిన్నరేళ్ల పాలనా కాలంలో బడ్జెట్, బడ్జెటేతర అప్పులు కలిపి రూ. 4.7లక్షల కోట్ల రుణాలు తెస్తే.. రేవంత్ రెడ్డి ఏడాదిన్నర కాలంలోనే రూ. 1.66 లక్షల కోట్ల అప్పు చేశారు. ఈ లెక్కను పరిశీలిస్తే ఏ విధంగా అడ్డగోలుగా అప్పులు చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చని ఆర్థిక విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలలో ప్రవేశపెట్టే బడ్జెట్ పత్రాలలో ఈ సంఖ్య ఇంకా ఎక్కువ పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో చెల్లింపుల విషయంలో కేసీఆర్ కంటే రేవంత్ కాస్తంత బెటర్ అన్న అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. కేసీఆర్ తన హయాంలో రూ.65 నుంచి 70 వేల కోట్ల మధ్య అసలు, వడ్డీ కింద రూ.1.15 లక్షల కోట్లు చెల్లించగా రేవంత్ రెడ్డి 2023 డిసెంబర్ నుంచి 2025 మార్చి వరకు రూ.28 వేల కోట్ల అసలు, వడ్డీ కింద రూ.48 వేల కోట్లు చెల్లించారని అధికారిక లెక్కలు పేర్కొంటున్నాయి.

ఉమ్మడి రాష్ట్ర వారసత్వ అప్పు 69వేల కోట్లే నిజానికి కేసీఆర్ అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న అప్పు ఉమ్మడి రాష్ట్రం నుంచి వారసత్వంగా వచ్చింది రూ.69,603 కోట్లు మాత్రమే. కానీ రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చే నాటికి తెలంగాణ రాష్ట్రానికి ఉన్న బడ్జెట్ అప్పు రూ.3.50 లక్షల కోట్లు. ఈ అప్పు ప్రస్తుతానికి రూ. 5 లక్షల కోట్లు దాటే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. బడ్జెటేతర అప్పులు అదనం.

**ఏటేటా పెరుగుతున్న వడ్డీల భారం**

రాష్ట్ర ఖజానాపై వడ్డీల భారం ప్రతి ఏటా పెరుగుతున్నది. 2014లో తెలంగాణ ప్రభుత్వం ఏడాదికి రూ.5,227 కోట్ల వడ్డీ చెల్లిస్తే 2023 నాటికి రూ.21 వేల కోట్లకు చేరింది. తాజాగా ఈ చెల్లింపులు రూ.25 వేల కోట్లు దాటాయి. 2025–26 ఆర్థిక సంవత్సరంలో వడ్డీ చెల్లింపుల కింద జనవరి 31వ తేదీ నాటికి రూ.24,085.22 కోట్లు చేశారు. ఫిబ్రవరి, మార్చి లెక్కల్లో మరో 5 వేల కోట్లు పెరిగే అవకాశం ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం కాగ్‌కు ప్రతి నెల సమర్పించే లెక్కలను పరిశీలిస్తే అర్థం అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడి అప్పులు చేయడంలో వడ్డీ భారం పెరగడమే కానీ తగ్గే పరిస్థితి కనిపించడం లేదు. వడ్డీ భారం తగ్గించుకోవడానికి రూ.87 వేల కోట్ల రుణాల రీస్ట్రక్చర్ చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని రేవంత్ సర్కారు కోరితే 24 వేల కోట్లకు మాత్రమే అనుమతి లభించింది. ఇప్పటి వరకు రేవంత్ సర్కారు 10.9 శాతం వడ్డీతో తీసుకున్న రూ. 30,536 కోట్లను రూ.7.5 శాతం వడ్డీకి తీసుకు వచ్చి తీర్చారు. దీంతో ప్రతి ఏడాదికి రూ.1,068.76 కోట్ల వడ్డీ భారం రాష్ట్ర సర్కారుపై తగ్గింది. ఇది గుడ్డిలో మెల్ల అన్న తీరుగా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**సొంత ఆదాయ వనరులేవి?**

రేవంత్ సర్కారు సొంత ఆదాయ వనరుల పెంపు కోసం కష్టపడకుండా అప్పులపైనే ఆధార పడుతున్నారన్న విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. తెచ్చిన అప్పుల్లో అభివృద్ధి కార్యక్రమాల కంటే సంక్షేమానికే ఎక్కువ ఖర్చు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 2025–26 ఆర్థిక సంవత్సరంలో వడ్డీ కింద రూ.19,369.02 కోట్లు, వివిధ రుణాలు (లోన్లు, అడ్వాన్స్‌లు, పేమెంట్ ఆఫ్ పబ్లిక్ డెబిట్ వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్, కేంద్ర ప్రభుత్వ రుణాలు, ఇతర రుణాలు) కలిపి రూ. 41,378.26 కోట్లు అసలు చెల్లించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. కానీ 2026 జనవరి నెలాఖరు వరకు కాగ్‌కు సమర్పించిన లెక్కల ప్రకారం చెల్లించిన అసలు మాత్రం రూ. 14,244.40 కోట్లుగా ఉన్నది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం వేసుకున్న అంచనాలు తలకిందులయ్యాయా? అన్న సందేహాలు సర్వత్రా వెలువడుతున్నాయి.

**చెల్లించే అప్పుల కంటే తెచ్చేవే ఎక్కువ**

కట్టే అప్పుల కంటే తెచ్చే అప్పులే ఎక్కువగా ఉన్నాయి. కేసీఆర్ ప్రభుత్వం రూ.4.7 లక్షల కోట్ల అప్పు చేసింది. తీర్చింది మాత్రం రూ. 70 వేల కోట్లే. రేవంత్ ప్రభుత్వం రూ.1.66 లక్షల కోట్ల అప్పు చేసింది. ఇందులో తీర్చింది కేవలం రూ. 48 వేల కోట్లే. అయితే ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రూ. 69 వేల కోట్ల రుణం తీసుకున్న రేవంత్ సర్కారు తీర్చిన అప్పు కేవలం రూ. 15 వేల కోట్ల లోపు మాత్రమే ఉండడం గమనార్హం. స్వంత ఆదాయాన్ని పెంచుకునే మార్గాల అన్వేషణ కంటే గత ప్రభుత్వ తప్పులను వేలెత్తి చూపి కాలం గడిపే పరిస్థితే రేవంత్ సర్కారు చేస్తున్నట్లు ఆరోపణలు వెలువడుతున్నాయి. కేసీఆర్ సరిగ్గా పాలించలేదనే కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారని, ఆదాయాన్ని పెంచి రాష్ట్రాన్ని అభివృద్ధి పథాన నడిపిస్తామంటేనే ఓట్లేశారని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. రూ.1.66 లక్షల కోట్ల రుణాలు తీసుకు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తన ల్యాండ్ మార్క్‌గా చెప్పుకొనే కొత్త ప్రాజెక్ట్ ఏమి కనిపించడం లేదని అంటున్నారు. మరో వైపు స్వంత ఆదాయం తీసుకు వచ్చే మార్గాల అన్వేషణ కూడా లేదన్న విమర్శలు సర్వత్రా వెలువడుతున్నాయి.

**హామీలకు ఎంత..?**

కాలేజీ యువతులకు ఈవీ స్కూటీలను ఇస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో.. ఈ బడ్జెట్ లో వీటికి కూడా నిధులు కేటాయించే అవకాశాలున్నాయి. ఇక విద్యా రంగానికి కూడా మరిన్ని కేటాయింపులు చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ బడ్జెట్‌లో ఉద్యోగులకు పీఆర్సీ అమలు, డీఏల విడుదల, రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల కోసం వీలైనన్ని ఎక్కువ కేటాయింపులు చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మూసీ పునరుజ్జీవం, ఆర్ఆర్ఆర్, ఎయిర్‌పోర్టులు, హైదరాబాద్ మెట్రో రెండో దశ, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ హాస్టల్స్ వంటి వాటికి భారీగా నిధుల కేటాయింపు ఉండే అవకాశాలు ఉన్నాయి.

**నేడు బడ్జెట్ ఇది..?**

అసెంబ్లీలో తెలంగాణ సర్కార్ బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. మొత్తం రూ.3.26 లక్షల కోట్లతో పద్దును ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ప్రధానంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. 3 రంగాలపై దృష్టి పెట్టినట్లు సమాచారం. మరోవైపు.. తెలంగాణ విజన్–2047 డాక్యుమెంట్‌లోన అంశాలపై ప్రత్యేక నిధులు కేటాయించనుంది. రేపు ఉదయం తెలంగాణ కేబినెట్ భేటీ అయి.. బడ్జెట్‌కు ఆమోదం తెలిపిన తర్వాత మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో.. మంత్రి శ్రీధర్ బాబు మండలిలో ప్రవేశపెట్టనున్నారు.

2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రోజున అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు సిద్ధం అయింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా.. ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేసేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ చర్యలు చేపట్టింది. ఇక ఈ ఏడాది బడ్జెట్ రూ.3.26 లక్షల కోట్లు ఉండొచ్చని సంబంధిత అధికారుల ద్వారా తెలుస్తోంది. అయితే తెలంగాణలో కీలకమైన సంక్షేమం, వ్యవసాయం, నీటి పారుదల రంగాలకు బడ్జెట్‌లో కాంగ్రెస్ సర్కార్ పెద్దపీట వేయనున్నట్లు.. ఈ రంగాలకు భారీగా కేటాయింపు చేయనున్నట్లు సమాచారం. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంతోపాటు భవిష్యత్ అవసరాలను తీర్చడమే లక్ష్యంగా ఈ బడ్జెట్‌ను రూపొందించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. అదే సమయంలో తెలంగాణ విజన్–2047 డాక్యుమెంట్ అమలు దిశగా ప్రత్యేకంగా నిధులను కేటాయించనున్నట్లు తెలుస్తోంది. ఈ బడ్జెట్‌పై శుక్రవారం ఉదయం 9.30 గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ మంత్రి వర్గ సమావేశం జరగనుంది. ఈ భేటీ తర్వాత బడ్జెట్‌కు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది.

ఆ తర్వాత అసెంబ్లీలో తెలంగాణ డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ 2026–27ను ప్రవేశపెట్టనుండగా.. అటు శాసనమండలిలో శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పద్దును సభ ముందుకు తీసుకురానున్నారు. గతేడాది రాష్ట్ర ప్రభుత్వ ఓన్ ట్యాక్స్ రెవెన్యూ (ఎస్ఓటీఆర్) పెరిగింది. వచ్చే ఏడాది సర్కార్ ఆదాయం మరింత పెరుగుతుందని.. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి వచ్చే నిధులు కూడా పెరుగుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

**సంక్షేమ పద్దులు**

ఈ నేపథ్యంలోనే గతేడాదితో పోలిస్తే.. ఈ సారి కాస్త అధికంగానే సర్కార్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్లు చర్చ జరుగుతోంది. దీంతో ఈసారి బడ్జెట్ రూ.3.26 లక్షల కోట్ల వరకు ఉండొచ్చని భావిస్తున్నారు. మరోవైపు.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 2 ఏళ్లు పూర్తి అయిన నేపథ్యంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా సంక్షేమం, సన్న బియ్యం కోసం భారీగా నిధులు కేటాయించేందుకు సర్కార్ రెడీ అయినట్లు సమాచారం.

**సాగు.. ప్రాజెక్టులుకు తప్పవు**

ఇతర రాష్ట్రాల్లో లేని విధంగా తెలంగాణలో వ్యవసాయ రంగానికి భారీ ఎత్తున నిధులు కేటాయించే అవకాశాలు కనిపిస్తున్నాయి. రైతు భరోసా, రైతు బీమా, సన్న వడ్ల బోనస్ వంటి పథకాలకు పెద్ద ఎత్తున నిధులను కేటాయించనున్నట్లు సమాచారం. ఇక నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ చేసేందుకు రూ.5 వేల కోట్ల వరకు అవసరం అవుతాయని అంచనా వేస్తున్నారు. వాటికి కూడా ఈ బడ్జెట్‌లో నిధులను కేటాయించనున్నారు. తుమ్మిడిహెట్టి, పాలమూరు–రంగారెడ్డి, సీతారామ, కొడంగల్ నారాయణ్‌పేట్ ఎత్తిపోతల పథకం, ఎస్ఎల్‌బీసీలకు ఈ బడ్జెట్‌లో రేవంత్ రెడ్డి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

**గ్రాంట్స్.. మ్యాచింగ్ ప్రపోజల్స్**

కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలకు.. మ్యాచింగ్ గ్రాంట్లను ఇచ్చి ఆ నిధులను వాడుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఉపాధి హామీ పథకంలో రాష్ట్రాల వాటా 40 శాతం ఉండాలని కేంద్ర ప్రభుత్వం కండిషన్ పెట్టగా.. రాష్ట్రంపై రూ.1800 కోట్ల భారం పడుతుందని అంచనా వేస్తున్నారు. వాటికి అనుగుణంగా కేటాయించనున్నారు.

## రూ.3.26 లక్షల కోట్లతో

# రాష్ట్ర బడ్జెట్!?

(మొదటి పేజీ తరువాయి)

అమలు చేయడంతో పాటు భవిష్యత్ అవసరాలను తీర్చడమే లక్ష్యంగా ఈ బడ్జెట్‌ను రూపొందించినట్లు సమాచారం. అదే సమయంలో తెలంగాణ విజన్–2047 డాక్యుమెంట్ అమలు దిశగా ప్రత్యేకంగా నిధులను కేటాయించనున్నట్లు తెలుస్తోంది. ఈ బడ్జెట్‌పై నేడు ఉదయం 9.30 గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ మంత్రి వర్గ సమావే శం జరగనుంది. ఈ భేటీ తర్వాత బడ్జెట్‌కు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. ఆ తర్వాత అసెంబ్లీలో తెలంగాణ డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ 2026 –27ను ప్రవేశపెట్టనుండగా.. అటు శాసనమండలిలో శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పద్దును సభ ముం దుకు తీసుకురానున్నారు.

గతేడాది రాష్ట్ర ప్రభుత్వ ఓన్ ట్యాక్స్ రెవెన్యూ (ఎస్ఓటీఆర్) పెరిగింది. వచ్చే ఏడాది సర్కార్ ఆదాయం మరింత పెరుగుతుందని.. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి వచ్చే నిధులు కూడా పెరుగుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాదితో పోలిస్తే.. ఈసారి కాస్త అధికంగానే సర్కార్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్లు చర్చ జరుగుతోంది. దీంతో ఈసారి బడ్జెట్ రూ.3.26 లక్షల కోట్ల వరకు ఉండొచ్చని భావిస్తున్నారు. మరోవైపు.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన నేపథ్యంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా సంక్షేమం, సన్న బియ్యం కోసం భారీగా నిధులు కేటాయించేందుకు సర్కార్ సిద్ధమైనట్లు సమాచారం.

**వ్యవసాయానికి తొలి ప్రాధాన్యం**

ఈ సారి బడ్జెట్ లో రాష్ట్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాల్లో లేని విధంగా వ్యవసాయ రంగానికి భారీ ఎత్తున నిధులు కేటాయించే అవకాశాలు కనిపిస్తున్నాయి. రైతు భరోసా, రైతు బీమా, సన్న వడ్ల బోనస్ వంటి పథకాలకు పెద్ద ఎత్తున నిధులను కేటాయించనున్నట్లు సమాచారం. అనుబంధ శాఖ అయిన సాగు నీటి ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ చేసేందుకు రూ.5 వేల కోట్ల వరకు అవసరం అవుతాయని అంచనా వేస్తున్నారు. వాటికి కూడా ఈ బడ్జెట్‌లో నిధులను కేటాయించనున్నారు. తుమ్మిడి హెట్టి, పాలమూరు–రంగారెడ్డి, సీతారామ, కొడంగల్ నారాయణ్‌పేట్ ఎత్తిపోతల పథకం, ఎస్ఎల్‌బీసీలకు ఈ బడ్జెట్‌లో రేవంత్ రెడ్డి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అలాగే కాలేజీ యువతులకు ఈవీ స్కూటీలను ఇస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో.. ఈ బడ్జెట్‌లో వీటికి కూడా నిధులు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. ఇక విద్యా రంగానికి మరిన్ని కేటాయింపులు చేసే అవకాశాలున్నాయి. ఈ బడ్జెట్‌లో ఉద్యోగులకు పీఆర్సీ అమలు, డీఏల విడుదల, రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల కోసం వీలైనన్ని ఎక్కువ కేటాయింపులు చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. మూసీ పునరుజ్జీవం, ఆర్ఆర్ఆర్, ఎయిర్‌పోర్టులు, హైదరాబాద్ మెట్రో రెండో దశ, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ హాస్టల్స్ వంటి వాటికి భారీగా నిధుల కేటాయింపు ఉండే అవకాశాలు ఉన్నాయి. చివరగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న పథకాలకు.. మ్యాచింగ్ గ్రాంట్లను ఇచ్చి ఆ నిధులను వాడుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఉపాధి హామీ పథకంలో రాష్ట్రాల వాటా 40 శాతం ఉండాలని కేంద్ర ప్రభుత్వం నిబంధన పెట్టగా.. రాష్ట్రంపై రూ.1800 కోట్ల భారం పడుతుందని అంచనా వేస్తున్నారు. వాటికి అనుగుణంగా బడ్జెట్‌లో కేటాయింపులు కేటాయించనున్నారు.

# మళ్లీ కేబినెట్ విస్తరణ?

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు అందరి దృష్టి ఢిల్లీ వేదికగా జరుగుతున్న పరిణామాలపైనే నెలకొంది.

**హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ కోసం**

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రేవంత్ రెడ్డి తనదైన శైలిలో పాలన సాగిస్తున్న ప్పటికీ, కేబినెట్ కూర్పులో మాత్రం గత ఎన్నికల సమీకరణాల ప్రభావం కొంత వరకు ఉంది. ఇప్పుడు ప్రభుత్వంపై పట్టు పెంచుకోవడానికి, పాలనలో వేగం పెంచడానికి తనకు అత్యంత సన్నిహితులైన వారితో పాటు, పనితీరులో దూకుడు ప్రదర్శించే నేతలకు చోటు కల్పించాలని ఆయన భావిస్తున్నారు. ముఖ్యంగా సామాజిక సమీకరణాలను సమతుల్యం చేస్తూనే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రక్షాళన చేయాలని రేవంత్ యోచిస్తున్నారు.

**రాహుల్ గాంధీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారా?**

ఢిల్లీ పర్యటనలో భాగంగా రాహుల్ గాంధీతో జరిగిన భేటీలో రేవంత్ రెడ్డి తన ప్రతిపాదనలను ఆయన ముందుంచినట్లు తెలుస్తోంది. అయితే, రాహుల్ గాంధీ నుంచి పూర్తి స్థాయి లో గ్రీన్ సిగ్నల్ లభించిందా లేదా అన్నది ఇంకా సస్పెన్స్‌గానే ఉంది. పార్టీలోని సీనియ ర్ నేతల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని హైకమాండ్ సూచించినట్లు సమాచారం. అయినప్పటికీ, గత లోక్ సభ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి సాధించిన ఫలితా లు, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తున్న తీరును చూస్తే, హైకమాండ్ వద్ద ఆయనకున్న పలుకుబడి దృష్ట్యా రేవంత్ కోరుకున్నట్లుగానే అనుమతి లభించే అవకాశాలు మెండుగా ఉన్నాయని భావిస్తున్నారు.

**అసెంబ్లీ తర్వాతే అసలు క్లారిటీ**

ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసిన వెంటనే ఈ కేబినెట్ విస్తరణ లేదా పునర్వ్యవస్థీకరణకు ముహూర్తం ఖరారు కావచ్చని పార్టీ వర్గాల సమాచారం. అసెం బ్లీలో ప్రతిపక్షాల విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టిన మంత్రులకు ప్రమోషన్లు, వివాదాల్లో ఉన్న లేదా ఆశించిన స్థాయిలో రాణించని వారికి ఉద్వాసన పలికే సూచనలు కనిపిస్తున్నాయి. బడ్జెట్ సెషన్ పూర్తి కాగానే కొత్త మం త్రుల ప్రమాణ స్వీకారం ఉండవచ్చనే ప్రచారం గాంధీ భవన్‌లో జోరుగా సాగుతోంది. ఖాళీగా ఉన్నది ఒకే మంత్రి పదవి. కానీ కొంత మందిని తప్పిస్తే మరికొంత మందికి అవకాశం లభిస్తుంది. ఉమ్మడి రంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు ప్రాతినిధ్యం కల్పించాలనే ఒత్తిడి రేవంత్ రెడ్డిపై ఉంది.

**పట్టుదల వెనుక వ్యూహం**

రేవంత్ రెడ్డి ఈ విషయంలో ఇంత పట్టుదలగా ఉండటానికి కారణం కేవలం మార్పులు చేయడం మాత్రమే కాదు; పార్టీపై తన ఆధిపత్యాన్ని చాటుకోవడం కూడా. హైకమాండ్ అనుమతితో తనకిష్టమైన వారిని కేబినెట్‌లోకి తీసుకోగలిగితే, పార్టీలో తనకు ఎదురులేదని నిరూపించుకోవచ్చనేది ఆయన వ్యూహం. ఒకవేళ ఇద్దరు ముగ్గురు సీనియర్ మంత్రుల శాఖలను మార్చగలిగితే, పాలనా యంత్రాంగం పై తన పట్టు మరింత బిగుస్తుంది.



# రైతు భరోసా ట్విస్ట్

(మొదటి పేజీ తరువాయి)

విడుదలలో కీలక మార్పులు చేశారు. తొలి విడతలోనే లబ్దిదారులందరికీ డబ్బులు అందనున్నాయి. ఇప్పటివరకు ఎకరం భూమి ఉన్న రైతుల నుంచి మొదలుపెట్టి విడతల వారీగా ఎక్కువ పోలం ఉన్న రైతులందరికీ నిధులు జమ చేసేవారు. దీని వల్ల ఏడెనిమిది విడతల్లో డబ్బులు జమ చేయడం వల్ల ఎక్కువ భూమి ఉన్న రైతులకు పెట్టుబడి సాయం అంటానికి చాలా ఆలస్యమవుతోంది. అయితే ఈ సారి ఈ విధానానికి రేవంత్ సర్కార్ స్వస్తి పలికింది. ఇక నుంచి పెట్టుబడి సాయం విడుదల చేయడంలో కొత్త విధానాన్ని పాటించాలని నిర్ణయించింది. ఈ సారి తొలి విడతలోనే రైతులందరీ అకౌంట్లో డబ్బులు పడేలా కొత్త నిర్ణయం అమలు చేయనున్నారు. తొలి విడతలో ఎకరం భూమికి రైతు భరోసా అకౌంట్లలో జమ చేయనుంది. అంటే ఎంత భూమి కలిగి ఉన్నవారికైనా.. తొలి ఎకరానికి రూ.6 వేలు తొలి విడతలో జమ చేసేలా మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్నారు.

**రైతు భరోసా నిధుల విడుదల పై తాజా నిర్ణయం**

ఎకరాకు మించి ఎంత పొలం ఉన్నా.. తొలి ఎకరానికి రూ.6 వేలు జమ చేస్తారు. దీని వల్ల లబ్ది దారులందిరికీ ఒకేసారి లబ్ది చేకూరనుంది. మిగతా ఎకరాలకు విడతల వారీగా డబ్బులు జమ చేస్తారు. ఈ నెల 22వ తేదీన సీఎం రేవంత్ నర్మెట్టలో జరిగే కార్యక్రమంలో ఎకరం భూమికి రైతుల ఖాతాల్లో నిధులు విడుదల చేయనున్నారు. మొదటి విడతలో 70 లక్షల మంది రైతులకు నిధులు జమ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇందు కోసం రూ.3,590 కోట్లు ఖర్చు కానుంది. ఇక తొలి విడత జమ చేసిన 20 రోజుల తర్వాత రెండో విడత సొమ్ము, ఏప్రిల్ నెలాఖరుకల్లా మూడో విడత నగదు జమ చేస్తారు. మూడు విడతల్లోనే ఈ సారి నగదు జమ చేసే ప్రక్రియ పూర్తి కానుంది. కాగా.. రైతు భరోసా కొత్త దరఖాస్తులను కూడా అర్హుల నుంచి ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఫిబ్రవరి 2026లోగా కొత్తగా పట్టాదారు పాస్ బుక్ పొందిన రైతులందరూ దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. స్థానిక రైతు వేదికలు, రైతు విస్తరణ అధికారుల వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది.

## తెలుగు చిత్ర పరిశ్రమ అభివృద్ధికి

# సంపూర్ణ సహకారం



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలుగు చిత్ర పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. తెలుగు చిత్ర పరిశ్రమ హాలీవుడ్ స్థాయికి ఎదగడం ఈ ప్రాంత ప్రజలకు గర్వ కారణమన్నారు. అనేక సందేశాత్మక తెలుగు సినిమాలు ప్రజల్లో మార్పునకు నాంది పలికాయని చెప్పారు. కమర్షియల్‌గా హిట్ అయిన సినిమాలు కూడా ఎన్నో ఉన్నాయన్నారు. గురువారం హైదరాబాద్‌లోని మాదాపూర్ హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్ లో తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, మెగాస్టార్ చిరంజీవి, టీఎఫ్‌డీసీ దిల్ రాజు హాజరయ్యారు. ఈ వేదికపైనే జ్యూరీ సభ్యులకు మెమొంటోలతో పాటు నగదు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ ఆత్మను ప్రపంచానికి పరిచయం చేసిన మహానీయుడు గద్దర్ అన్నారు. ఆయన పేరిట అవార్డులు ఇవ్వడం అంటే ప్రభుత్వ ఆలోచన ఏమిటో ప్రపంచానికి చెప్పడమే అన్నారు. గద్దర్ కేవలం వ్యక్తిగా కాకుండా.. ఒక వ్యవస్థగా.. ఒక సందేశసాత్మకమైన తెలంగాణ ఆటను, పాటను తెలంగాణ ఆత్మని ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. అలాంటి గద్దర్ గారి పేరు మీద అవార్డులను ప్రకటించి.. ప్రభుత్వ ఆలోచన విధానం ఏంటో ప్రపంచ వ్యాప్తంగా తెలుపడానికి ఈ అవార్డులు అందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో మరిన్ని మంచి సినిమాలు అందించాలని సినీ ఇండస్ట్రీని కోరారు. తెలుగు సినిమా తెలంగాణ రాష్ట్రానికే పరిమితం కాకుండా ప్రపంచానికే తలమానికం కావాలని సీఎం రేవంత్ రెడ్డి గద్దర్ పేరిట సినిమా అవార్డులను తిరిగి ప్రారంభించారని చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం సినిమా అవార్డులు ఇవ్వలేదన్నారు. గద్దర్ అవార్డులకు ఎంపికైన నటీనటులకు, టెక్నీషన్స్ కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరుపున అభినందనలు తెలిపారు. అలాగే ఎంతో బిజీగా ఉండీ ఈ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి వచ్చిన ప్రముఖ నటులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ధన్యవాదాలు తెలిపారు. సామాజిక సందేశాత్మక సినిమాలను పారదర్శకంగా ఎంపిక చేసిన ఫిలిం డెవలప్మెంట్ కౌన్సిల్, జ్యూరీ సభ్యులకు భట్టి విక్రమార్క అభినందనలు తెలిపారు. కాగా ఇప్పటికే ప్రభుత్వం గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్–2025 విజేతలను ప్రకటించింది. గతేడాది జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ పొందిన చిత్రాలకు అవార్డ్స్ ప్రకటించారు. తాజాగా గురువారం ఉగాది సందర్భంగా అవార్డులను అందజేశారు. గద్దర్ –2025 ఫిల్మ్ అవార్డ్స్‌లో రాజు వెడ్స్ రాంబాయి, ఛాంపియన్ సినిమాలు అత్యధికంగా అవార్డ్స్ సొంతం చేసుకున్నాయి. తండేల్ సినిమాకు గాను నాగచైతన్యకు ఉత్తమ నటుడిగా అవార్డ్ దక్కింది. రష్మిక (ది గర్ల్ ఫ్రెండ్ ) మూవీకి గాను ఉత్తమ నటిగా ఎంపికైంది. ప్రముఖ నటుడు చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం దక్కింది. నటుడు కమల్ హాసన్‌కు పైడి జయరాజ్ అవార్డు దక్కడం విశేషం. గేయ రచయిత సుద్దాల అశోక్ తేజకు సినారే అవార్డు వరించింది.

ఉద్యోగాల కోసం సరైన నైపుణ్యాలు పెంచుకోండి

మీ ఫీల్డ్‌కు అవసరమైన స్కిల్స్ నేర్చుకోండి. ఆన్‌లైన్ కోర్సులు, ట్రైనింగ్‌ల ద్వారా నైపుణ్యాలు మెరుగుపరుచుకోండి.




# 'మాయి ముంత' అద్భుతం

- తెలంగాణ జీవన విధానాన్ని తెలియజేశారు
- పెద్దింటి రచనలు కదిలించేలా ఉన్నాయి
- అశోక్ కుమార్ కథల సంపుటిపై కేటీఆర్ స్పందన
- రచయితను అభినందిస్తూ సోషల్ మీడియాలో పోస్టు




**ముద్ర డెస్క్:**
తెలంగాణ జన జీవన పోరాటాలను, సామాన్యుల ఆరాటాలను తన కలం ద్వారా కథలుగా మలుస్తున్న ప్రముఖ రచయిత పెద్దింటి అశోక్ కుమార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశంసలు కురిపించారు. ఇటీవల అశోక్ కుమార్ రాసిన 'మాయి ముంత' కథా సంపుటిని చదివిన కేటీఆర్, ఆ కథలు తనను ఎంతగానో ప్రభావితం చేశాయని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ముఖ్యంగా ఇందులోని 'మాయి ముంత', 'సావు దప్పు', 'జిద్దు' వంటి కథలు తనను లోతుగా కదిలించాయని, ఇవి కేవలం కథలు మాత్రమే కావని, మన అస్తిత్వపు వేదనలకు నిలువుటద్దాలని ఆయన అభిప్రాయపడ్డారు. భారతీయ సాహిత్యంలో కలకాలం నిలిచిపోయే అద్భుతమైన రచనలుగా వీటిని అభివర్ణించిన కేటీఆర్, మట్టి పరిమళాల రచయితగా గుర్తింపు పొందిన అశోక్ కుమార్‌కు తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. తెలంగాణ మట్టి వాసనను, ఇక్కడి మనుషుల జీవన శైలిని ప్రతిబింబించే ఇలాంటి గొప్ప రచనలు మరిన్ని రావాలని ఆయన ఆకాంక్షించారు. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్ట్ వైరల్‌గా మారింది.

# ఈ ఏడాది దేశానికి మంచి భవిష్యత్తు

- మోదీ నాయకత్వంలో అభివృద్ధి పథంలో భారత్
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఉగాది పంచాంగం



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
ఈ ఏడాది దేశానికి ఎంతో మంచి భవిష్యత్తు ఉందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు పుష్కలంగా పండుతాయన్నారు. ప్రజలందరూ ఎటువంటి సమస్యలు లేకుండా సుఖశాంతులతో జీవించబోతున్నారని వెల్లడించారు. మన దేశ ఎదుగుదలను ఓర్వలేని శత్రువులు, దేశద్రోహులకు మాత్రమే పరాభవం ఉంటుందని చెప్పారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన 'శ్రీ పరాభవ నామ సంవత్సర' ఉగాది వేడుకల్లో పాల్గొన్న కిషన్ రెడ్డి పంచాంగ శ్రవణం అనంతరం రాష్ట్ర ప్రజలకు, తెలుగు వారందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని అనేక దేశాలు నేడు యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలు, శాంతిభద్రతల సమస్యలతో సతమతమవుతున్నాయని చెప్పారు. భారతదేశం మాత్రం ప్రధాని మోదీ శక్తివంతమైన నాయకత్వంలో అభివృద్ధి పథంలో నిరంతరం దూసుకుపోతోందని చెప్పారు. దేశ ప్రజలు ఐక్యంగా నిలబడి, ఏ సమస్యనైనా ఎదుర్కొనే ఆత్మవిశ్వాసంతో ఉన్నారని తెలిపారు. ఇది మనందరికీ గర్వకారణమన్నారు. ఉగాది పచ్చడిలోని షడ్రుచులు మన జీవితానికి ప్రతీక అని కిషన్ రెడ్డి తెలిపారు. సుఖదుఃఖాలు, కష్టనష్టాలు అన్నీ కలగలిసి ఉండటమే జీవితం అన్న ఆయన ఈ కొత్త సంవత్సరంలో భారతదేశానికి మరింత అభివృద్ధి, శాంతి, సుభిక్షం కలగాలని ఆకాంక్షించారు.

# మల్లు స్వరాజ్యం ఆశయాలను కొనసాగిద్దాం

**ముద్ర, నల్గొండ:**
కామ్రేడ్ మల్లు స్వరాజ్యం ఆశయాలను కొనసాగిద్దామని సీపీఎం నూతనకల్ మండల కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి పిలుపునిచ్చారు. నల్గొండ జిల్లా నూతనకల్ మండలం చిల్పకుంట్లలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో కామ్రేడ్ మల్లు స్వరాజ్యం నాలుగో వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కందాల శంకర్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధురాలు, మాజీ ఎమ్మెల్యే, మొట్టమొదటి మహిళ దళ కామాండర్ మల్లు స్వరాజ్యం అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఉక్కు మహిళ మల్లు స్వరాజ్యం భూమి, బుక్తి విముక్తి కోసం అనేక పోరాటం చేసిందన్నారు. బాంచన్ దొర కాలు మొక్కుతా అన్న వాళ్లతోనే బందు పెట్టించిన వీర వనిత అని కొనియాడారు. పదమూడేళ్ల వయస్సు లోనే నైజం నావాబులు, ఎర్రబాడు దొరలకు ఎదురు నిలిచి తెలంగాణ ఝాన్సిరాణిలా పోరాడారని చెప్పారు. ఈ ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే మల్లు దంపతుల విగ్రహాలను రాష్ట్ర అసెంబ్లీ ఆవరణతో పాటు ట్యాంక్ బండ్ పైన ఆవిష్కరించాలని కోరారు. వీరి జీవిత చరిత్ర ను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు అంజపల్లి లక్ష్మయ్య, గ్రామ శాఖ కార్యదర్శులు బొజ్జ శ్రీను, బత్తుల తిరుమలేష్, గజ్జల శ్రీనివాస్ రెడ్డి, శాఖ సభ్యులు ముండ్ల సంజీవ్, బత్తుల సూరయ్య, బత్తుల రవి, ఉప్పుల పరమేష్, తొట్ల శేఖర్, అల్లిపురం శ్రీనివాస్ రెడ్డి, కుసు వెంకన్న, దగ్గుల రామచంద్రు, ఇరుగు రమేష్, తొట్ల వెంకయ్య, పంతం పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.



# తెలుగు లోగిళ్లలో 'నవ వసంతం'..

- ప్రజలకు ప్రముఖుల ఉగాది శుభాకాంక్షలు
- చెడు తొలగి అందరికీ మంచి కలగాలన్న నేతలు







**ముద్ర డెస్క్:**
తెలుగు నూతన సంవత్సరం 'శ్రీ పరాభవ' నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలువురు రాజకీయ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, రాష్ట్రాలు అభివృద్ధి పథంలో పయనించాలని వారు ఆకాంక్షించారు.

**కొత్త శక్తికి, ఆరంభాలకు ఉగాది ప్రతీక: ప్రధాని మోదీ**

ప్రధాని నరేంద్ర మోదీ తెలుగులో ట్వీట్ చేస్తూ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సంప్రదాయాలతో ముడిపడి ఉండటంతో పాటు కొత్త శక్తికి, ఆరంభాలకు ఉగాది పండుగ ప్రతీక. రాబోయే సంవత్సరం అందరికీ ఆనందాలు, విజయాలు, ఆరోగ్యంతో నిండి ఉండాలని ప్రార్థిస్తున్నాను. సమాజ శ్రేయస్సుకు సానుకూలతతో దోహదపడేలా ఈ ఏడాది ప్రతి ఒక్కరినీ ప్రేరేపించాలని కోరుకుంటున్నాను అని ప్రధాని పేర్కొన్నారు.

**సద్గుణాలతో కూడిన జీవన తత్వమే ఉగాది: రేవంత్ రెడ్డి**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి జీవితంలోని కష్టసుఖాలకు సంకేతమని, అందరూ సద్గుణాలతో జీవన తత్వాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. కొత్త ఏడు తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది, దేశానికే ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

**భావి జీవితంపై ఆశలు రేకెత్తించే పండుగ: చంద్రబాబు నాయుడు**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ.. ఈ నూతన సంవత్సరం భావి జీవితంపై కొత్త ఆశలను రేకెత్తిస్తుందని పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యంతో రాష్ట్రం ముందుకు సాగాలని, ప్రతి ఇంటా సంతోషం, ఆరోగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని కోరుకున్నారు. పేదరికం లేని సమాజ నిర్మాణం కోసం అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**సర్వశుభాలు కలగాలి: నేతల ఆకాంక్ష**

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి, లోకేష్ సహా పలువురు నేతలు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. చెడు తొలగి అందరికీ మంచి కలగాలని, రైతులు పాడిపంటలతో వర్ధిల్లాలని వారు భగవంతున్ని ప్రార్థించారు.

# పగలు జ్యోతిష్యం.. రాత్రి అయితే మహిళలతో..



- జ్యోతిష్యుడి ముసుగులో దారుణాలు.. రాజకీయ సంబంధాలతో కేసు సంచలనం
- మత్తుమందు ఇచ్చి వేధింపులు.. వీడియోలతో బ్లాక్‌మెయిల్ గుట్టు రట్టు
- 58 అసభ్య వీడియోలు సీజ్.. మహారాష్ట్రలో ప్రకంపనలు రేపిన ఘటన

**ముద్ర డెస్క్:**
మహారాష్ట్రకు చెందిన గాడ్ మ్యాన్ గా పేరు పొందిన నాసిక్ కు చెందిన జ్యోతిష్యుడు, న్యూమరాలజిస్ట్ అశోక్ కారత్ తాజాగా లైంగిక వేధింపుల కేసులో అరెస్ట్ అయ్యాడు. అయితే ఇతడికి మహారాష్ట్రలోని రాజకీయ నేతలు, సెలబ్రిటీలు, వ్యాపారవేత్తలతో సంబంధాలున్నాయి. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర వ్యాప్తంగా ఒక్కసారిగా రాజకీయ ప్రకంపనలు చెలరేగాయి. ఇదే విషయంపై అధికార కూటమిపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శనాస్త్రాలు సంధిస్తున్నాయి. అశోక్ కుమార్ కారత్ గతంలో మెర్చంట్ నేవీ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించాడు. పదవీ విరమణ అనంతరం తనకు తాను జ్యోతిష్యుడిగా ప్రకటించుకున్నాడు. అయితే ఆయన తాజాగా ఓ రేప్ కేసులో అరెస్ట్ కావడం సంచలనం రేపుతోంది. ఓ 35 ఏళ్ల మహిళపై నవంబర్ 2022 నుంచి డిసెంబర్ 2025 వరకు లైంగిక దాడికి పాల్పడినట్లు తేలింది. గత కొన్నేళ్లుగా అశోక్ కుమార్ కు మహారాష్ట్రలోని ఎంతోమంది రాజకీయ నేతలతో సత్సంబంధాలు కలిగి ఉన్నట్లు సమాచారం. ఇక అశోక్ కుమార్ కారత్ తన వద్దకు వచ్చే మహిళలకు మత్తుమందు ఇచ్చి లైంగిక దాడి చేసేవాడని పోలీసుల విచారణలో తేలింది. వీడియోలు తీసి బ్లాక్ మెయిల్ చేస్తూ దోపిడీ చేసేవాడని పోలీసులు గుర్తించారు. ఈ మేరకు అతడ్ని అరెస్టు చేసి 58 అసభ్యకర వీడియోలను సీజ్ చేశారు.ఇతడికి మహారాష్ట్రలోని రాజకీయ నేతలు, సెలబ్రిటీలు, వ్యాపారవేత్తలతో సంబంధాలున్న నేపథ్యంలో అన్ని కోణాల్లో దర్యాప్తును వేగవంతం చేశారు పోలీసులు. మరోవైపు శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ ఈ ఘటనను "మహారాష్ట్ర ఎప్ స్టీన్ ఫైల్స్" అని అభివర్ణించారు. అధికార పార్టీ నేతలు అతనికి అండగా నిలుస్తున్నారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ మేరకు అశోక్ కుమార్ కారత్ పై భారతీయ న్యాయ సంహిత (బీఎన్.ఎస్) లోని సెక్షన్ 64 కింద అత్యాచారం కేసు, అలాగే మోసపూరిత పద్ధతుల్లో లైంగిక సంబంధం కేసును నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



# పేద విద్యార్థులకు చిరు మెగా సాయం..

**సూర్య 'అగరం' స్ఫూర్తితో ఉచిత విద్య!**

**ముద్ర డెస్క్:**
తెలుగు సినీ ఇండస్ట్రీలో మెగాస్టార్ చిరంజీవి కేవలం నటనతోనే కాకుండా, తన సేవా గుణంతోనూ ముందుంటారు. దాదాపు మూడు దశాబ్దాలుగా చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ (CCT) ద్వారా లక్షలాది మందికి రక్తాన్ని, వేలాది మందికి చూపును ప్రసాదించారు. ఇప్పుడు ఆయన తన సేవా ప్రస్థానంలో మరో అద్భుతమైన అధ్యాయానికి శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ ఉగాది పర్వదినం సందర్భంగా మెగాస్టార్ ప్రకటించిన 'విద్యాదాన' సంకల్పం ఇప్పుడు రెండు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారింది.ఈ ఉగాది సందర్భంగా ఒక ఇంటర్వ్యూలో చిరంజీవి ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నారు. ఒకప్పుడు తనను చూసి సూర్య స్ఫూర్తి పొంది సేవలోకి వచ్చానని చెప్పారు. కానీ, నేడు సూర్య నడుపుతున్న 'అగరం ఫౌండేషన్' చూసి నేను ఇన్‌స్పైర్ అయ్యాను అని చిరంజీవి తెలిపారు. తమిళనాడులో వేలాది మంది నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను అందిస్తున్న సూర్య సేవా దృక్పథం తనను కదిలించిందని, అందుకే తెలుగు రాష్ట్రాల్లోనూ అక్షర యజ్ఞం మొదలుపెట్టాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కేవలం ఫీజులు కట్టడమే కాకుండా, మారుమూల ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి, వారికి ప్రపంచ స్థాయి విద్యను ఉచితంగా అందించడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశ్యం అని చిరంజీవి తెలిపారు. ఒక్క బిడ్డ చదువుకుంటే ఆ కుటుంబం దారిద్ర్యం నుంచి బయటపడుతుంది. ఈ బృహత్తర కార్యక్రమాన్ని మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు రామ్ చరణ్ పర్యవేక్షణలో ప్రత్యేక విభాగం పనిచేస్తుంది. ఇప్పటికే చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ వెబ్‌సైట్‌ను ఆధునీకరించి, డిజిటల్ పద్ధతిలో దరఖాస్తులు స్వీకరించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

# వందేమాతరం పాడాల్సిందే

- లేదంటే లోపలేస్తాం
- జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎంఐఎం అరాచకాలను ఎండగడతాం
- రైతు సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వానిది ద్వంద్వ నీతి
- రైతు కూలీలు, కౌలు రైతులకు పెట్టుబడి సాయం ఏమైందీ..?
- కరీంనగర్ లో కేంద్ర మంత్రి బండి సంజయ్



**ముద్ర, కరీంనగర్:**
దేశంలో ఉండాలంటే వందేమాతరం పాడాల్సిందేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. లేదంటే లోపల వేస్తామని హెచ్చరించారు. అసెంబ్లీలో గవర్నర్ శుక్లా ప్రసంగంపై ధన్యవాద తీర్మాణంపై చర్చ సమయంలో జరిగిన వందేమాతరం ఆలపనలో ఎంఐఎం ఎమ్మెల్యేలు సభ నుంచి బయటకు వెళ్లిపోవటాన్ని బండి సంజయ్ తీవ్రంగా తప్పుబట్టారు. ఈ దేశంలో ఉండేవారు ఎవరైనా వందేమాతరం పాడాల్సిందేనని అన్నారు. తాము అధికారంలోకి వస్తే దీనిని తప్పనిసరి చేస్తామని.. అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎంఐఎం నేతల ఓటు బ్యాంకు రాజకీయాలకు సీఎం, స్పీకర్ తలొగ్గుతున్నారని విమర్శించారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎంఐఎం అరాచకాలను ఎండగడతామని, అసదుద్దీన్ ఓవైసీ నడిపే విద్యా సంస్థల్లోనే ఉగ్రవాద మూలాలు ఉన్నాయని సంచలన ఆరోపణలు చేశారు. రైతు సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం ద్వంద్వ నీతి అవలంభిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రైతు కూలీలకు, కౌలు రైతులకు సాయం ఎందుకు అందడం లేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ఈ నెల 22న ఇస్తామన్న రైతు భరోసా సహా, పెండింగ్‌లో ఉన్న ఐదు వాయిదాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గుజరాత్‌లో సబర్మతి నదిని అభివృద్ధి చేసినట్లు ఇక్కడా మూసీ పునరుజ్జీవం చేయాలన్నారు. అందుకోసం బుల్డోజర్లతో పేదల ఇళ్లను కూల్చి వేస్తే బీజేపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. బాధితులకు తగిన పరిహారం చెల్లించిన తర్వాతే ముందడుగు వేయాలని సూచించారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో స్పీకర్ నిర్ణయం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని బండి సంజయ్ చురకలంటించారు. శాసనసభ, స్పీకర్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందూ బంధువులందరికీ పరాభవ నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరి కష్టాలు తొలిగిపోయి సుఖశాంతులతో ఉండాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నానని చెప్పారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
20.03.2026 శుక్రవారం, హైదరాబాద్



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ 'ముద్ర' వేయండి

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744

## తెలంగాణ ఆర్థిక ముఖచిత్రం: అప్పుల వారసత్వం అభివృద్ధి సవాళ్లు



తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఒక కీలక మలుపులో నిలిచింది. స్వరాష్ట్రంగా ఏర్పడిన తర్వాత దశాబ్ద కాలంలో అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల విస్తరణలో గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ, ఆర్థిక నిర్వహణలోని సవాళ్లు ఇప్పుడు స్పష్టమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్ కేవలం ఆదాయం-వ్యయాల లెక్కలు కాకుండా, రాష్ట్ర భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే పత్రంగా మారనుంది. గత పది సంవత్సరాల్లో పేరుకుపోయిన అప్పులు, ఆఫ్‌బడ్జెట్ రుణాలు, కార్పొరేషన్ గ్యారెంటీలు, పెరుగుతున్న సంక్షేమ వ్యయం మరియు భారీ మౌలిక పెట్టుబడులు బడ్జెట్ రూపకల్పనను క్లిష్టతరం చేస్తున్నాయి. సంక్షేమం-అభివృద్ధి మధ్య సమతుల్యత ఎలా సాధిస్తారన్నది కీలకం. 2014లో సుమారు ₹75,577 కోట్ల అప్పుతో ప్రారంభమైన తెలంగాణ, హైదరాబాద్ ఆదాయం, ఐటీ వృద్ధి, రియల్ ఎస్టేట్ వల్ల ప్రారంభంలో బలంగా నిలిచింది. అయితే భారీ ప్రాజెక్టుల కోసం అధిక రుణాలు తీసుకోవడం వల్ల అప్పులు పెరిగి, ప్రస్తుతం వడ్డీలతో కలిపి దాదాపు ₹7 లక్షల కోట్లకు చేరినట్లు అంచనా. ప్రతిరోజూ సుమారు ₹191 కోట్లు వడ్డీ చెల్లింపులు చేయాల్సి రావడం ఆర్థిక ఒత్తిడిని చూపుతోంది. ప్రస్తుత ప్రభుత్వానికి మరో సవాలు ఎన్నికల హామీల అమలు. మహాలక్ష్మి, గృహ జ్యోతి, రైతు భరోసా వంటి పథకాలకు సుమారు ₹56,084 కోట్ల అదనపు భారం పడుతోంది. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్ సబ్సిడీలు, రైతు రుణ మాఫీ వంటి చర్యలకు భారీ నిధులు అవసరం. ఇప్పటికే విద్యుత్ రంగంలో ఉన్న బకాయిలతో ఈ భారాన్ని మోయడం కష్టసాధ్యం. ఆదాయం పెంపులో రాష్ట్రం పన్నులు, కేంద్ర వాటా, గ్రాంట్లపై ఆధారపడుతోంది. ఎక్సైజ్, రిజిస్ట్రేషన్లు, వ్యాట్ కీలకం. రియల్ ఎస్టేట్ ద్వారా ఆదాయం పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. పన్నేతర ఆదాయంగా మైనింగ్, భూముల వినియోగం, డిజిటల్ ఫీజులు పెంచాలి. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, ఆర్థిక సంఘం వాటా పెంపు కూడా ముఖ్యమే. విద్య, వైద్య రంగాలకు అధిక కేటాయింపులు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. పాఠశాలల ఆధునీకరణ, డిజిటల్ క్లాస్‌రూమ్స్, ఆసుపత్రుల మెరుగుదలపై దృష్టి ఉంది. రెవెన్యూ వ్యయం తక్షణ ఉపశమనం ఇస్తే, మూలధన వ్యయం దీర్ఘకాల అభివృద్ధి కల్పిస్తుంది. కాబట్టి మూలధన వ్యయాన్ని పెంచడం అవసరం. ఐటీ, ఫార్మా, తయారీ రంగాలకు ప్రోత్సాహం ద్వారా ఉపాధి అవకాశాలు పెంచాలని లక్ష్యం. డీబీటీ ద్వారా సంక్షేమ పథకాలలో పారదర్శకత పెంపు, అవినీతి నియంత్రణకు చర్యలు అవసరం. వ్యవసాయంలో పంటల విభిన్నీకరణ, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్ సదుపాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. మొత్తంగా, తెలంగాణను అప్పుల ఒత్తిడినుంచి బయటపడేసి అభివృద్ధి దిశగా తీసుకెళ్లే బడ్జెట్ అవసరం. వాస్తవిక అంచనాలు, ఆర్థిక క్రమశిక్షణతో రూపొందిన బడ్జెట్ మాత్రమే రాష్ట్ర ప్రగతికి దోహదపడుతుంది. సంక్షేమం-అభివృద్ధి సమతుల్యంగా సాగినప్పుడే "బంగారు తెలంగాణ" సాధ్యమవుతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
,కాలమిస్ట్...
9440595494

# పేద విద్యార్థుల కలలపై నీలినీడలు

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు



భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో సామాజిక న్యాయం మరియు సమాన విద్యా అవకాశాల సాధన అనేది కేవలం రాజ్యాంగబద్ధమైన లక్ష్యం మాత్రమే కాదు, అది ఒక తరం భవిష్యత్తును నిర్ణయించే కీలక శక్తి. ఈ క్రమంలోనే ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన అత్యంత సాహసోపేతమైన, మానవీయమైన పథకం 'ఫీజు రీయింబర్స్‌మెంట్'. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఆర్థిక కారణాల వల్ల ఉన్నత విద్యకు దూరం కాకూడదనే సత్సంకల్పంతో ప్రారంభమైన ఈ పథకం, గత రెండు దశాబ్దాలుగా లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపింది. ముఖ్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి హయాంలో ఈ పథకం ఒక విప్లవాత్మక మార్పుగా రూపుదిద్దుకుంది. అంతకుముందు వరకు కేవలం సంపన్న వర్గాలకు మాత్రమే పరిమితమైన ఇంజినీరింగ్, మెడిసిన్, ఫార్మసీ వంటి వృత్తి విద్యా కోర్సులు, ఈ పథకం పుణ్యమా అని మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని సామాన్య రైతు బిడ్డలకు కూడా అందుబాటులోకి వచ్చాయి. సామాజికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మరియు ఈబీసీ వర్గాలకు చెందిన విద్యార్థులందరికీ 100 శాతం ఫీజు చెల్లింపు హామీని ప్రభుత్వం ఇవ్వడంతో, ఉన్నత విద్యలో ప్రవేశాల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. గణాంకాలను పరిశీలిస్తే, ఈ పథకం అమలులోకి రాకముందు వృత్తి విద్యా కోర్సుల్లో చేరే గ్రామీణ విద్యార్థుల శాతం 20 కంటే తక్కువగా ఉండగా, 2010 నాటికి అది 50 శాతానికి పైగా చేరుకోవడం గమనార్హం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఈ పథకం 'రీజినల్ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ' మార్గదర్శకాల ప్రకారం కొనసాగుతూ వస్తోంది. తెలంగాణలో ప్రతి ఏటా సుమారు 10 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. ఇందుకోసం ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో సుమారు 5,000 నుండి 6,000 కోట్ల రూపాయల వరకు నిధులను కేటాయిస్తోంది. ఇందులో ట్యూషన్ ఫీజుతో పాటు విద్యార్థుల భోజన, వసతి ఖర్చుల కోసం ఇచ్చే మెస్ ఛార్జీలు కూడా కలిసి ఉంటాయి.

అయితే, ఇంతటి ప్రతిష్టాత్మకమైన పథకం గత కొన్నేళ్లుగా తీవ్రమైన నిధుల కొరత మరియు పరిపాలనాపరమైన జాప్యంతో సతమతమవుతోంది. ప్రభుత్వం నుండి సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో బకాయిలు కొండలా పేరుకు పోతున్నాయి. తాజా నివేదికల ప్రకారం, గత రెండు మూడు విద్యా సంవత్సరాలకు సంబంధించి వేల కోట్ల రూపాయల బకాయిలు ఇంకా చెల్లింపులకు నోచుకోలేదు. ఈ పరిస్థితి అటు విద్యార్థులను, ఇటు విద్యాసంస్థలను అగమ్యగోచరంలోకి నెట్టి వేస్తోంది. ప్రైవేట్ కళాశాలలు ప్రధానంగా ఈ రీయింబర్స్‌మెంట్ నిధులపైనే ఆధారపడి నడుస్తుంటాయి. అధ్యాపకుల జీతాలు, భవనాల అద్దెలు, ల్యాబ్ నిర్వహణ మరియు ఇతర మౌలిక వసతుల కల్పన అంతా ఈ నిధులతోనే ముడిపడి ఉంటుంది. ప్రభుత్వం నుండి ఒకటి రెండు ఏళ్ల పాటు నిధులు రాకపోవడంతో అనేక చిన్న మరియు మధ్య తరహా కళాశాలలు మూతపడే దిశగా వెళ్తున్నాయి. ఇది విద్యా ప్రమాణాల పతనానికి దారితీస్తోంది. మరోవైపు, ఈ బకాయిల భారానికి బలి అవుతున్నది మాత్రం నిరుపేద విద్యార్థులే. కళాశాల యాజమాన్యాలు తమ ఆర్థిక ఇబ్బందులను అధిగమించడానికి విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయి. ప్రభుత్వం నుండి డబ్బులు వచ్చే వరకు ఎదురు చూడలేమని, విద్యార్థులే స్వయంగా ఫీజులు చెల్లించాలని కొన్ని యాజమాన్యాలు కఠినంగా వ్యవహరిస్తున్నాయి. దీనివల్ల పరీక్షల సమయంలో హాల్ టికెట్లు నిలిపివేయడం, కోర్సు పూర్తయిన తర్వాత ఒరిజినల్ సర్టిఫికేట్లు మరియు మార్కుల మెమోలు ఇవ్వకుండా ఆపివేయడం వంటి సంఘటనలు రాష్ట్రవ్యాప్తంగా నిత్యకృత్య మయ్యాయి. ఉన్నత చదువులు చదివినా పట్టా చేతికి అందక, ఉద్యోగాల దరఖాస్తులకు అనర్హులుగా మారుతున్న వేలాది మంది యువతలో మానసిక ఆందోళన పెరుగుతోంది. తమ తప్పు లేకపోయినా, కేవలం ప్రభుత్వ చెల్లింపుల జాప్యం వల్ల తమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ సమస్య వెనుక ఉన్న కారణాలను విశ్లేషిస్తే, ఆర్థిక ప్రాధాన్యతలలో మార్పులు మరియు పరిపాలనాపరమైన చిక్కులు ప్రధానంగా కనిపిస్తాయి. ప్రభుత్వాలు ప్రజాకర్షక పథకాలకు ప్రాధాన్యత ఇస్తూ, విద్యా రంగం వంటి దీర్ఘకాలిక పెట్టుబడి రంగాలను విస్మరిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బడ్జెట్ కేటాయింపులు కాగితాల మీద భారీగా కనిపిస్తున్నా, వాస్తవ విడుదల విషయంలో మాత్రం తీవ్ర జాప్యం జరుగుతోంది. అంతేకాకుండా, విద్యార్థుల ఆదాయ ధృవీకరణ పత్రాల తనిఖీ, కాలేజీల అఫిలియేషన్ ప్రక్రియలో ఉన్న సంక్లిష్టతలు కూడా నిధుల విడుదలకు అడ్డంకిగా మారుతున్నాయి. ఆధార్ అనుసంధానం, బయోమెట్రిక్ హాజరు వంటి సాంకేతిక సంస్కరణలు ప్రవేశపెట్టి నప్పటికీ, డేటా ప్రాసెసింగ్‌లో నెలకొన్న లోపాలు లబ్ధిదారులకు శాపంగా పరిణమించాయి. ఈ అనిశ్చితి వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులకు పంపించాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. విద్యా రంగ నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ సమస్యకు తక్షణ పరిష్కారం చూపకపోతే సామాజిక చలనం (Social Mobility) దెబ్బతింటుంది. అంటే, ఒక తరం తన ఆర్థిక స్థితిగతులను మార్చుకోవడానికి ఉన్న ఏకైక మార్గం విద్య. ఆ విద్యనే దూరం చేస్తే, పేదరికం వారసత్వంగా కొనసాగే ప్రమాదం ఉంది. మానవ వనరుల అభివృద్ధిని కాంక్షించే ఏ ప్రభుత్వమైనా విద్యను కేవలం ఒక సంక్షేమ ఖర్చుగా కాకుండా, దేశ ప్రగతికి పునాదిగా భావించాలి.

ప్రస్తుత సంక్షోభం నుండి గట్టెక్కాలంటే ప్రభుత్వం ఒక నిర్దిష్టమైన కార్యాచరణను రూపొందించు కోవాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ఏ త్రైమాసికానికి ఆ త్రైమాసికం (Quarterly) విడుదల చేసే విధంగా ఒక 'గ్రీన్ ఛానల్' వ్యవస్థను ఏర్పాటు చేయాలి. బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ఇతర పథకాలకు మళ్లించకుండా, కేవలం విద్య కోసమే వినియోగించేలా చట్టబద్ధమైన హామీ ఉండాలి. అలాగే, విద్యార్థుల ధృవీకరణ ప్రక్రియను మరింత సరళతరం చేస్తూ, పూర్తిస్థాయి డిజిటలైజేషన్ ద్వారా జాప్యాన్ని నివారించాలి. విద్యాసంస్థలు కూడా విద్యార్థుల సర్టిఫికేట్లను అడ్డుకోకుండా, ప్రభుత్వం నుండి వచ్చే బకాయిల కోసం చట్టబద్ధమైన పోరాటం చేయాలే తప్ప విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకో కూడదు. ప్రభుత్వం, విద్యాసంస్థలు మరియు విద్యార్థి సంఘాల మధ్య సమన్వయం కుదిరినప్పుడే ఈ పథకం తన అసలు లక్ష్యాన్ని చేరుకోగలదు.

ఒక దేశం యొక్క గొప్పతనం అది నిర్మించిన భవనాల్లో లేదు, అది తీర్చిదిద్దిన మేధావుల ఆలోచనల్లో ఉంటుంది. పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదన్న రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడు కోవాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. బకాయిలను వెంటనే చెల్లించి, విద్యార్థుల గుండెల్లో గూడుకట్టుకున్న ఆందోళన మబ్బులను తొలగించడమే నేటి తక్షణ అవసరం. అప్పుడే మన దేశ యువత ప్రపంచ వేదికపై సగర్వంగా నిలబడి, నవ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కాగలరు. విద్యార్థుల భవిష్యత్తుపై మబ్బులు వీడి, జ్ఞాన సూర్యుడు ప్రకాశించాలంటే ప్రభుత్వాల సంకల్పం దృఢంగా ఉండాలి.

రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...
9440595494

## శాంతి దిశగా తెలంగాణ.. ఒక కొత్త అధ్యాయం


దశాబ్దాల పాటు హింసతో ముడిపడిన దండకారణ్య ప్రాంతం ఇప్పుడు శాంతి వైపు మళ్లడం తెలంగాణకు ఒక కీలక మలుపు. ఇటీవల భారీ స్థాయిలో మావోయిస్టుల లొంగుబాట్లు, వారి నాయకత్వం బలహీనపడటం వంటి పరిణామాలు కేవలం భద్రతా చర్యల ఫలితమే కాదు, మారుతున్న సామాజిక వాస్తవాల ప్రతిబింబం. ఈ మార్పుకు రెండు ప్రధాన కారణాలు కనిపిస్తున్నాయి. ఒకవైపు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు మావోయిస్టుల కార్యకలాపాలను తగ్గించగా, మరోవైపు ప్రభుత్వం తీసుకున్న పునరావాస చర్యలు వారికి కొత్త జీవితంపై నమ్మకాన్ని కల్పించాయి. లొంగిపోయిన వారికి ఆర్థిక సహాయం, నివాసం, ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారిని సమాజంలో కలుపుకోవడం ఒక సానుకూల మార్పు. ఇప్పటి తెలంగాణ సమాజం కూడా మారింది. సంక్షేమ పథకాలు గ్రామీణ జీవనాన్ని బలోపేతం చేయడంతో ప్రజలు హింసకు దూరంగా అభివృద్ధిని కోరుకుంటున్నారు. ఒకప్పుడు అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రారంభమైన ఉద్యమం, కాలక్రమేణా ప్రజల మద్దతును కోల్పోయింది. తెలంగాణ మోడల్ ఇప్పుడు దేశానికి మార్గదర్శకంగా నిలుస్తోంది. కేవలం బలప్రయోగం కాకుండా, మానవీయ దృక్పథంతో సమస్యను పరిష్కరించవచ్చని ఇది చూపిస్తోంది. అయితే, ఈ శాంతి ప్రక్రియ కొనసాగాలంటే ప్రభుత్వం, మాజీ మావోయిస్టులు, సమాజం - ఈ మూడు వర్గాలు కలిసి పనిచేయాలి. శాంతి అనేది గమ్యం కాదు, నిరంతర ప్రయాణం. తెలంగాణ ఆ దిశగా వేసిన ఈ అడుగు భవిష్యత్ తరాలకు భద్రత, స్థిరత్వానికి పునాది కావాలి.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్
విశ్లేషణ 9848559863




# కాళేశ్వరం ఆలయం లో సమస్యల తిష్ట







**పవిత్రతకు ముప్పు**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో గోదావరి ఒడ్డున అద్భుత ప్రకృతి సోయగాల మధ్య వెలసిన కాళేశ్వరం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయం దక్షిణకాశిగా ప్రసిద్ధి చెందింది. గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా సరస్వతి నది సంగమించే ఈ త్రివేణి సంగమ క్షేత్రం అత్యంత పుణ్యస్థలంగా భావించబడుతోంది. దేశం నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చే ఈ ఆలయంలో యముడు, శివుడు ఒకే పానవట్టంపై లింగాకృతిలో దర్శనమివ్వడం ప్రత్యేకతగా నిలుస్తోంది. పురాణాల ప్రకారం యముడు చేసిన తపస్సుకు ప్రసన్నమైన శివుడు ఇక్కడే తనతో పాటు లింగాకారంగా వెలసే వరం ఇచ్చినట్లు చెబుతారు. కాబట్టి ముందుగా యమలింగాన్ని, తరువాత శివలింగాన్ని దర్శించుకోవడం ద్వారా పుణ్యలోక ప్రాప్తి కలుగుతుందనే విశ్వాసం భక్తుల్లో ఉంది. కాకతీయుల కాలం నుంచే ఈ క్షేత్రానికి విశేష ప్రాధాన్యం ఉండి, వారి విజయాల అనంతరం ఈ దేవాలయాన్ని దర్శించడం ఆనవాయితీగా ఉండేది. ఇంతటి పవిత్రత కలిగిన ఈ క్షేత్రంలో ప్రస్తుతం పలు సమస్యలు భక్తులను తీవ్రంగా కలవరపెడుతున్నాయి. ముఖ్యంగా గోదావరి ఘాట్ పరిసరాలు అపరిశుభ్రంగా మారడం ఆందోళన కలిగిస్తోంది. నదిలోకి వెళ్లే మెట్ల వద్ద ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, చెత్త గుట్టలుగా పేరుకుపోవడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. ప్రతిరోజూ వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే ఈ ప్రాంతం శుభ్రత లేకుండా ఉండటం ఆలయ పవిత్రతకు భంగం కలిగిస్తోంది. అదేవిధంగా, ఆలయం పరిసరాల్లోని అద్దె గదుల నిర్వాహకులు అధిక ధరలు వసూలు చేయడం, దుకాణదారులు వస్తువులను ఎక్కువ రేట్లకు అమ్మడం భక్తులకు భారంగా మారుతోంది. గుడి ముందు యాచకుల సంఖ్య అధికమై, భక్తులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఘటనలు కూడా వెలుగులోకి వస్తున్నాయి. కొందరు భక్తులు డబ్బులు ఇవ్వకపోతే దూషణలకు గురవుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. మరింతగా, కొందరు పూజారులు కానుకల ఆధారంగా ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇది ఆలయ ఆచారవ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఈ నేపథ్యంలో దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ ఈవో తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. గోదావరి ఘాట్ ప్రాంతాన్ని శుభ్రపరచి ప్లాస్టిక్ వ్యర్థాలను పూర్తిగా తొలగించాలి. ఆలయాన్ని ప్లాస్టిక్ రహిత క్షేత్రంగా మార్చే దిశగా కఠిన చర్యలు చేపట్టాలి. అద్దె గదులు, దుకాణాలపై నియంత్రణ పెట్టి భక్తులకు అనుకూలమైన ధరలు అమలు చేయాలి. యాచకుల నియంత్రణ, భద్రతా చర్యలు కూడా బలోపేతం చేయాలి.

పవిత్రతకు ప్రతీకగా నిలిచిన కాళేశ్వరం క్షేత్రం తన మహిమను నిలబెట్టుకోవాలంటే అధికారులు, స్థానికులు, భక్తులు కలిసి బాధ్యతగా వ్యవహరించాల్సిన సమయం ఇది.

కామిడి సతీష్ రెడ్డి జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా
9848445134

ఉద్యోగాల కోసం మంచి రెజ్యూమ్ తయారు చేయండి

సింపుల్‌గా, క్లియర్‌గా మీ వివరాలు ఇవ్వండి. మీ స్కిల్స్, అనుభవం హైలైట్ అయ్యేలా రెజ్యూమ్ ఉండాలి.

# సంప్రదాయబద్ధంగా ఉగాది వేడుకలు

**ఇంటింటా పండుగ శోభ**
**కిక్కిరిసిన ఆలయాలు**
**పంచాంగ శ్రవణాలు**

**ముద్ర, జోగులాంబ గద్వాల ప్రతినిధి:**

శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలను గురువారం ప్రజలు సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజామునే ప్రజలు మామిడి, వేప తోరణాలు, పూలతో ఇళ్లను అలంకరించి షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని దేవతలకు నైవేద్యంగా సమర్పించి, అందరికి పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంతో పాటు గద్వాల ధరూర్, మల్దకల్ కేటిదొడ్డి, గట్టు, తదితర మండలాలలోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ అర్చకులు పంచాంగ శ్రవణం చేశారు. రైతులు వ్యవసాయ క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అరకలతో తొలి దుక్కులు దున్నారు. గద్వాల పట్టణంలోని శ్రీ సుంకులమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. భక్తులు సుంకులమ్మ అవ్వను దర్శించుకుని నైవేద్యం సమర్పించి తమ మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రాంగణంలో కోళ్లను కోసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించడం ఆనవాయితీ.





### ఆలయాల్లో పంచాంగ శ్రవణం

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

పరాభవ నామ ఉగాది సందర్భంగా జిల్లా కేంద్రంలోని పలు దేవాలయాల్లో పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవస్థానం, వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం, శ్రీ సీతారామస్వామి దేవాలయం, గోవింద క్షేత్రం హౌసింగ్ బోర్డ్ నందు పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. వేదమూర్తులైన బ్రాహ్మణులచే శాస్త్రోక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేవాలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ ఆచార్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవుడు కాలాన్ని తెలుసుకొని మెలిగితే దైవానుగ్రహం తప్పకుండా లభిస్తుందని తెలిపారు. తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం అనుకూలంగా ఉన్నప్పుడు సంపద, ఆయుష్షు, ఆరోగ్యం, కార్యసిద్ధి కలుగుతాయని వివరించారు.వర్జ్యం, దుర్ముహూర్తం, రాహుకాలంలో శుభకార్యాలు చేయకూడదని, కాలానికి అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. కలియుగం ప్రారంభమై 5127 సంవత్సరాలు పూర్తయ్యాయని పేర్కొంటూ, ఈ సంవత్సరం రాజుగా గురువు, మంత్రిగా కుజుడు, సైన్యాధిపతిగా చంద్రుడు ఉన్నారని తెలిపారు. గురువు రాజు కావడంతో గురువుల ప్రాధాన్యత మరింత పెరుగుతుందని చెప్పారు.మే 11 నుండి 29 వరకు కర్తరి ఉండటంతో శుభకార్యాలు చేయరాదని తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. అర్చకులు శ్రీకాంత్ ఆచార్యులు , ఆలయ అధ్యక్షులు తీగల సురేంద్ర ప్రధాన కార్యదర్శి మిడిదొడ్డి నాగరాజు కోశాధికారి నాగరాజు మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పంచాంగ శ్రవణంలో పాల్గొన్న తాండూర్ ఎమ్మెల్యే

**ముద్ర, తాండూర్:**



వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలోని ప్రసిద్ధి ప్రసిద్ధిగాంచిన భద్రేశ్వర స్వామి దేవాలయంలో పంచాంగ శ్రవణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి పట్టణంలోని హిందూ బంధువులు, దేవాలయ కమిటీ సభ్యులతో కలసి పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి. ఈ సందర్భంగా వేద పండితుల పంచాంగ శ్రవణం మనోరంజకంగా కొనసాగింది. ఈ ఏడాది జరిగే శుభకార్యాలు కష్టనష్టాల గురించి పలు రాశుల ఫలితాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో చెడు పరా భావం మంచితనం విజయం సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ పట్లోళ్ల నీరజ, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నర్సింలు, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కొత్త ఏడాది సుఖశాంతులివ్వాలి

**-ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**

శ్రీ పరాభవ నామ సంవత్సరం ప్రజలందరికీ సుఖశాంతులు అందించాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. ఉగాది వేడుకల్లో భాగంగా మహబూబ్ నగర్ లోని శిల్పారామం ప్రాంగణంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిం చిన ఉగాది పంచాంగ శ్రవణం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా పంచాంగ కర్త శ్రవణ్ కుమార్ పంచాంగ శ్రవణం నిర్వ హించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లా డుతూ మహబూబ్ నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది, విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాల్లో ముందంజలో నిలవాలన్నారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారే పల్లి సురేందర్ రెడ్డి, నగర కార్పొరేటర్లు, కమిషనర్ రామాంజనేయులు రెడ్డి పాల్గొన్నారు.

## ఏప్రిల్ 3న పేటలో హిందూ సమ్మేళనం



**ముద్ర, నారాయణపేట:**

జిల్లా కేంద్రంలోని సింగర్ బేస్ శ్రీ సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాల లో ఏప్రిల్ 3 న సాయంత్రం 6 గంటలకు హిందూ సమ్మేళన నిర్వహించనున్నట్లు హిందూ సమ్మేళన కార్యక్రమ కమిటీ అధ్యక్షుడు గుంపు బాలరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పది ఉప బస్తీల నుంచి ఆధ్యాత్మిక భజన సంకీర్తనలతో ఆధ్యా త్మికత ఉట్టిపడేలా కార్యక్రమానికి కాలి నడకన హాజరుకావాల్సి ఉంటుందని తెలిపారు. యజ్ఞం, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖ ముఖ్య వక్త సందేశం ఉంటుందని తెలిపారు. అనంతరం ఆత్మీయ హిందూ సమ్మేళన కమిటీని పాలమూరు జిల్లా సహకార్య వాహ మ్యాడమ్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు గా గుంపు బాలరాజ్, ఉపాధ్యక్షులుగా దత్తు చిల్లాల్, రాజ్ కుమార్ దోత్రే, వినోద్, విజయలక్ష్మి , కొండోళ్ల రాములు, కార్యదర్శిగా యశ్వంత్, సహకార దర్శులుగా ఉదయ్ కుమార్, చిన్నరఘు, కిరణ్, సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు.

## రసూల్ పూర్ కు శ్రీరామపురంగా నామకరణం



**ముద్ర, తాండూర్:**

వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణ పరిధిలోని కొడంగల్ ప్రధాన రోడ్డు మార్గంలో వెలసి, ప్రఖ్యాతిగాంచిన రసూల్ పూర్ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంతాన్ని శ్రీరామపురంగా నామకరణం చేశారు. వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీరామపురం గా నామకరణం చేశారు. గురువారం దేవాలయ సమీపంలో ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, ఆంజనేయ స్వామి భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ కార్పొరేటర్ కు శుభాకాంక్షలు

**ముద్ర, కూకట్‌పల్లి:**

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని అల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కు డివిజన్‌లోని పలువురు రాజకీయ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగావెంకటేష్‌గౌడ్ మాట్లాడుతూ అందరి జీవితాల్లో కొత్త ఆశలు, ఉన్నత ఆశయాలు, వినూ త్న ఆలోచనలతో ఆనందమయం కావాలని కోరారు. నాయకులు పట్వారి శశిధర్, చిన్నోళ్ల శ్రీనివాస్, అగ్రవాసు, సంగమేష్, హరీష్, వెంకటేష్, యాకయ్య గౌడ్, మహేష్, నాగరాజు, రాజు గౌడ్, బాబ్జి, పంతులు, వెంకట్, శివ, ప్రవీణ్, మోహన్ పాల్గొన్నారు.

## బోర్ మోటార్ ప్రారంభం

**ముద్ర, గద్వాల:**

ధరూర్ మండలం వామన్ పల్లి గ్రామంలో తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన నూతన బోరు మోటార్ కు గురువారం సర్పంచ్ పర్నికా కృపాక ర్రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు డి.నారాయణరెడ్డి, ఉపసర్పంచ్ శిరీషరాజు, వార్డు మెంబర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సహజ పానీయాలను అలవాటు చేసుకుందాం

**ముద్ర, కాప్రా:**



కూల్‌డ్రింక్స్ వినియోగాన్ని తగ్గించాలని, సహజ పానీయాలు తీసుకోవాలని జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు పిలుపునిచ్చారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జన విజ్ఞాన వేదిక మేడ్చల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఈసీఐఎల్ చౌరస్తాలో ఉగాది పండగ సందర్భంగా “కూల్‌డ్రింక్ మానేద్దాం – సహజ పానీయాలను తాగుదాం” అనే నినాదంతో ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా హాజరైన ప్రొఫెసర్ బి.ఎన్.రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ పెద్ది శ్రీలనివాస్ గుప్తా, వాసవి క్లబ్ కోశాధికారి తారకేశ్వర్ లు మాట్లాడుతూ మార్కెట్‌లో లభించే కూల్‌డ్రింక్స్ ఆరోగ్యానికి హానికరమని, వీటి వినియోగం వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. మన పూర్వీకులు అనుసరించిన సహజ పానీయాలు శరీరానికి శక్తిని, ఆరోగ్యాన్ని అందిస్తాయని తెలిపారు. ఉగాది పచ్చడి వంటి సంప్రదాయ ఆహారాలు జీవన విధానంలో భాగమని, ఇవి మన సంస్కృతి, ఆరోగ్య పరిరక్షణకు ప్రతీకలని పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాస్, కోశాధికారి పి.నాగరాజు మాట్లాడుతూ రసాయనాలతో తయారయ్యే కూల్‌డ్రింక్స్ శరీరానికి మేలు చేయవని, వీటి బదులు నిమ్మరసం, పానకం, రాగిజావా, కొబ్బరినీళ్లు, మజ్జిగ వంటి సహజ పానీయాలను తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. పండుగల సందర్భాల్లో సంప్రదాయ ఆహారాల ప్రాముఖ్యతను గుర్తించి, ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా ఉగాది వేడుకలు



**ముద్ర, కూకట్ పల్లి:**

ఉగాది పండుగ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు తన కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా కార్యకర్తలకు, నాయకులకు ఉగాది పచ్చడిని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం మాట్లాడుతూ కార్యకర్తలందరూ ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటూ, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని కోరారు. ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు నిండాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో స్థానిక బిజెపి నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# ముస్లింలకు ఎమ్మెల్యే బట్టలు పంపిణీ

**ముద్ర, కాప్రా:**



పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని సైనిక్ పురిలోని ఎమ్మెల్యే నివాసంలో ఉప్పల్ నియోజకవర్గంలో ముస్లింలకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బట్టలు పంపిణీ చేశారు. బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల ప్రజలు సఖ్యత, సౌభ్రాతృత్వంతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దేవేందర్ రెడ్డి , ప్రభుదాస్, మైనార్టీ సెల్ బీ ఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బద్రుద్దిన్, పార్టీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, జహంగీర్ రహీం, నవీన్ మాస శేఖర్ రహమాన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం పెద్దలు, పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ కార్యాలయంలో పండుగ



**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:**



జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ జిల్లా ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు అందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కొత్త సంవత్సరం అందరికీ శుభాలను తీసుకురావాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సాహంగా ఉగాది వేడుకలను జరుపుకున్నారు.

### కేరెల్లిలో..

వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా ఉగాది సంబరాలు నిర్వహించారు. ధారూర్ మండల్ కేరెల్లి గ్రామంలో ఉగాది పండుగను ఆనందోత్సాహాలతో నిర్వహించారు. కులమత భేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా పండుగ ను జరుపుకోవడం గ్రామ ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా యువజన సంఘం ఆధ్వర్యంలో తగాఫర్ థర్డ్ గేమ్, పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మొత్తం 8 జట్లు పాల్గొన్న ఈ క్రీడలో ఒక్కొ జట్టులో 10 మంది యువకులు తమ ప్రతిభను ప్రదర్శించారు. గ్రామ పెద్దలు ఈ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పోటీల్లో విజేతగా నిలిచిన బేకరి శ్రీనివాస్ జట్టుకు రూ.5 వేల నగదు బహుమతిని ధారూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి అందించగా, ద్వితీయ స్థానంలో నిలిచిన బల్వంత్ రెడ్డి జట్టుకు రూ.2,500 సర్పంచ్ అంపల్లి పద్మ రాములు అందజేశారు. ఇరు జట్లు బహుమతి నగదు మొత్తాన్ని కేరెల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాల అవసరాల కోసం వినియోగించాలని నిర్ణయించి సర్పంచ్‌కు అందజేయడం విశేషం.

# గ్రంథాలయ మాజీ చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలి

**ముద్ర, తాండూర్:**



వికారాబాద్ జిల్లా తాండూర్ బీఆర్ఎస్ నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్‌పై చర్యలు తీసుకోవాలని తాండూరు బంజారా సమాజ్ నేతలు డిమాండ్ చేశారు. గురువారం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షుడు ధారాసింగ్‌ను ఉద్దేశిస్తూ రాజుగౌడ్ బంజారా జాతిపై వాఖ్యలు చేయడాన్ని ఖండించారు. రాజకీయంగా విమర్శలు చేయడం సహజమేనని, వ్యక్తిగతంగా విమర్శలు చేయడం తగదన్నారు. ధారాసింగ్‌పై, జాతిపై వాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. జాతిపై విమర్శలు చేసిన రాజుగౌడ్‌ను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బంజారా జాతిపై విమర్శలు చేసిన రాజుగౌడ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బంజారా సమాజ్ ఉపాధ్యక్షులు అనిల్ కుమార్ రాథోడ్, ప్రధాన కార్యదర్శి గోపాల్, జాయింట్ సెక్రటరీ చందర్ చౌహాన్, పవన్ కుమార్, రమేష్, శ్రీను జాదవ్, బాబు నాయక్ పాల్గొన్నారు.

**ఉద్యోగాల కోసం కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరుచుకోండి**

స్పష్టంగా మాట్లాడటం, రాయడం నేర్చుకోండి. ఇంటర్వ్యూలో ఇది మీకు పెద్ద ప్లస్ అవుతుంది.



# సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలి

**- తెలంగాణపై బీజేపి నిర్లక్ష్యం**

**- మంత్రి పొన్నం ప్రభాకర్**



**ముద్ర, కరీంనగర్:** తెలుగు నూతన సంవత్సరంలో ప్రజా పాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అవరోధాలు లేకుండా ప్రజలకు చేరాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. గురువారం నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో రాష్ట్రమంతా సమృద్ధిగా వర్షాలు కురవాలని భగవంతున్ని కోరినట్లు చెప్పారు. ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ఏర్పడిన ఈ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. తమ ప్రభుత్వం పేదల కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. జాతీయ గీతాన్ని ఎవరైనా గౌరవించాల్సిందేనని స్పష్టం చేశారు.గాంధీ స్మృతి వనం ఏర్పాటుకు ఆటంకాలు కలిగించడం బాధాకరమన్నారు. తమ పార్టీ ఎప్పుడు అన్ని మతాలు, కులాలు, ప్రాంతాలకు సమ ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. మోదీ పాలనలో మాటల గారడి తప్ప, దేశానికి చేసిందేమి లేదని ఆరోపించారు. బీజేపీ తెలంగాణపై నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు.మూసి నిర్వాసులకు న్యాయం చేసిన తరువాతనే ముందడుగు వేస్తామని ముఖ్యమంత్రి తెలిపారన్నారు. నిర్వాసితులకు అన్యాయం జరగనివ్వమని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టును ప్రతిపక్షాలు అప్రతిష్ట పాలు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. మూసి అభివృద్ధి చేసి పేదలకు జీవనోపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. పేదల సంక్షేమాన్ని తమ పార్టీ ఎప్పుడు మరవదని చెప్పారు. జవహర్ లాల్ నెహ్రూ నుంచి తమ పార్టీకి అలాంటి చరిత్ర లేదని వెల్లడించారు. ఇప్పటికైనా తెలంగాణ అభివృద్ధికి బీజేపీ, బీఆర్ఎస్ లు సహకరించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, లైబ్రరీ చైర్మెన్ సత్తు మల్లేష్, కరీంనగర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, కార్పొరేటర్ అంజన్ కుమార్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ గౌడ్, ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ



**ముద్ర, ఆదిలాబాద్:** జిల్లా కేంద్రంలోని శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠంలో గురువారం సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జరిగిన ఉగాది వేడుకల్లో కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొన్నారు. పరాభవ నామ తెలుగు నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించారు. భక్తులకు ఉగాది పచ్చడి, గుడాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఎంచుకున్న రంగాల్లో విజయం సాధించాలని, దృఢ సంకల్పంతో చేపట్టే కార్యాల్లో శుభాలు కలగాలని ఆకాంక్షించారు. ప్రజలంతా మంచి ఆలోచనలతో జీవితంలో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మఠాధిపతి యోగానంద సరస్వతి, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, కోశాధికారి రవీందర్, సభ్యులు కందుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది పచ్చడి పంపిణీ

**ముద్ర, ఆదిలాబాద్:** జిల్లా కేంద్రంలో గురువారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రయాణికులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఊశన్న మాట్లాడుతూ శీతల పానీయాలు సేవించడం వల్ల ఆరోగ్యంతోపాటు ఆర్థికంగానూ నష్టపోతామన్నారు. సహజ పానీయాలు అంటే మజ్జిగ, కొబ్బరి బొండం, రాగి జావ, నిమ్మరసం, చెరకు రసం ఆరోగ్యంతోపాటు రైతాంగానికి ఆర్థిక ప్రయోజనాన్ని చేకూరుస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నూతుల రవీందర్, జిల్లా గౌరవ అధ్యక్షులు సాముల వీరన్న, అధ్యక్షులు దండ నాయక ఉమా కాంత్, జిల్లా నాయకులు కత్తి శ్రీధర్ బాబు, వేముల నాగరాజు, అమిత్, గంగన్న , బాస లింగన్న పాల్గొన్నారు.

## గుండారంలో క్రికెట్ టోర్నమెంట్

**ముద్ర, పెద్దపల్లి:** ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం గుండారంలో గురువారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం ఐదు జట్లు పాల్గొనగా.. మల్లేశ్-11, హనుమాన్-11 జట్లు ఫైనల్‌కు చేరాయి. హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో మల్లేశ్-11 జట్టు విజేతగా నిలిచింది.

# మైనార్టీలకు అండగా ప్రజా ప్రభుత్వం

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర, ధర్మపురి:** ప్రజా ప్రభుత్వం మైనార్టీలకు ఎప్పుడు అండగా ఉంటుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. గురువారం ధర్మపురి పట్టణంలోని ఎస్ఎచ్ గార్డెన్ లో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు తోఫా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ అన్నారు. దేశంలో అన్ని మతాలు, కులాలను గౌరవిస్తుందని పేర్కొన్నారు. మైనార్టీల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముస్లింలకు తోఫా పంపిణీ చేయాలని నిర్ణయించారన్నారు. ధర్మపురి నియోజకవర్గంలోని 2,050 మందికి రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా పేద ముస్లింల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. వచ్చే గోదావరి పుష్కరాలకు ధర్మపురికి పెద్ద ఎత్తున నిధులు తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రితో మాట్లాడి ధర్మపురి బస్ డిపో మంజూరు కోరకు కృషి చేస్తానని తెలిపారు. గోదావరి పుష్కరాలు వరకు ధర్మపురి బస్ డిపో నిర్మాణం పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ అంటేనే పేదల సంక్షేమ ప్రభుత్వమని తెలిపారు. ముస్లింలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్ర మంలో అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, మార్కెట్ కమి టీ చైర్మన్ తిరుమల లావణ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పెందుర్తి , కౌన్సిలర్లు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

# ఘనంగా ఉగాది వేడుకలు




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** జిల్లా వ్యాప్తంగా గురువారం ఆనందోత్సాహాలతో తెలుగు నూతన సంవ త్సర వేడుకలు నిర్వహించుకున్నారు. పండుగను పురస్కరించుకుని పలు గ్రామా ల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. పట్టణంలోని శివాజీ చౌక్ లో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఉగాది పం డుగ నిర్వహించి పచ్చడి వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అవినాష్ తో పాటు విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక ఆర్కే ఫంక్షన్ హాల్ లో ఉగాది ఉత్సవ సమి తి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. లోక కల్యాణం కోసం యజ్ఞం నిర్వహించారు. టీవీ జబర్దస్త్ బృందం సభ్యులు సునామీ సుధాకర్, భాస్కర్, ప్రవీ ణ్, వినోదిని హాస్య ప్రదర్శనను తిలకించారు.

**వెన్నెల డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో..**

పట్టణానికి చెందిన వెన్నెల డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవులు, కళాకారులను సత్క రించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్ర మాలతో ఆకట్టు కున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి మాట్లాడుతూ వెన్నెల డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో ప్రతి యేటా ఉగాది ఉత్సవాలు నిర్వహించడం హర్షణీయమని పేర్కొన్నారు. నిర్మల్ పట్టణంలో ఎంతో మందిని కళాకారులుగా తీర్చిదిద్దుతూ అందరి మన్ననలను పొందుతున్నారన్నారు. ఈ కార్యక్ర మంలో కౌన్సిలర్ ఎస్పి రాజు, లక్కా కుల హరీష్, అడప పోశెట్టి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, అడప పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ మంత్రి

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు లో మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, మున్సి పల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రఫ్ఫు, రాజు, జాకిర్, సల్మాన్, రఫీ తదితరులు పాల్గొన్నారు.




## కాళేశ్వరంలో పంచాంగ శ్రవణం



**మహాదేవపూర్, ముద్ర:** కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో తెలుగు నూతన సంవత్సరం ఉగాది సందర్భంగా గురువారం ఆలయ ఉప ప్రధాన అర్చకులు నాగఫణి శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. మండల కేంద్రంలోని రామాలయంలో తిరుపతి మురళీధర స్వామి పంచాంగం వినిపించగా, ఉమామహేశ్వర ఆలయంలో సాలగ్రామ శ్రీనివాస్ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ వేద పండితులు, కాళేశ్వరం సర్పంచ్ వెన్నపు రెడ్డి మోహన్ రెడ్డి, రామాలయంలో నిషేధిత పరిషత్ అధ్యక్షుడు దేవరావు, ఉమా మహేశ్వర ఆలయంలో కాళేశ్వరం దేవస్థానం మాజీ చైర్మన్ రామన్ రావు, ఆయా గ్రామాల ప్రముఖులు, వ్యాపారులు, భక్తులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల తోడ్పాటుతోనే అభివృద్ధి




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** సమాజంలోని అన్ని వర్గాల తోడ్పాటుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి అన్నారు. ఉగాది పండుగ పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు మిత్ర మండలి 25వ వార్షికోత్సవంలో భాగంగా నియోజకవర్గంలోని మున్నూరు కాపు ప్రజా ప్రతినిధులకు ఆత్మీయ సమ్మేళనం, సన్మాన సభ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, సర్పంచ్ లను సత్కరించారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మెన్ మాట్లాడుతూ కేవలం ఒక సామాజిక వర్గం ఐక్యత వల్ల రాజకీయ ఎదుగుదల కష్టమన్నారు. అన్ని సామాజిక వర్గాల తోడ్పాటుతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రతి సామాజిక వర్గానికి ఓ కుల వృత్తి ఉంటుందని, వారి తోపాటు వారి వృత్తిని ఆదరించాల్సిన అవసరం ఉందన్నారు. కనుక అన్ని వర్గాల వారికి ఆదరణ, గౌరవం ఇవ్వడంలో మున్నూరు కాపులు ముందు వరసలో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు అప్పాల మహేష్, ప్రధాన కార్యదర్శి గంద్రత్ రమేష్, ఉపాధ్యక్షులు నలిమెల పోశెట్టి, అయ్యన్నగారి శ్రీనివాస్, కోశాధికారి అదుముల్ల శ్రీనివాస్, ఉప కోశాధికారి అదుముల్ల నరేందర్, ఒడ్నం నరేందర్, కూన చంద్రకాంత్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కౌఠ(బి)లో పంచాంగ శ్రవణం



**బోథ్, ముద్ర:** ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని కౌఠ (బి) గ్రామంలో గురువారం ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు నమలికొండ సంతోష్ కుమార్ శర్మ పరాభవ నామ సంవత్సర ఉగాది ఫలితాలను తెలిపారు. రాశుల వారిగా ఆదాయ, వ్యయాలను వివరించారు. సంవత్సర వాతావరణ, వర్షాల వివరాలు తెలియజేశారు. ఎయే పంటలు ఈ సంవత్సర అనుకూలంగా ఉంటాయో చెప్పారు. అనంతరం గ్రామస్తులు రాబోయే శ్రీరామ నవమి ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పిడుగు అశోక్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజు బాపు, సర్పంచ్ ఓరుగంటి స్వామి, ఉపసర్పంచ్ ఇట్టెడి రమణారెడ్డి, పెద్దకాపు గాజుల సురేందర్, పాత పెద్దకాపు గాజుల పోతయ్య, గ్రామస్తులు మురళీధర్ రెడ్డి, సింగడి రాంరెడ్డి, గంగాధర్, లస్మన్న, నోముల బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీ అధికార ప్రతినిధిగా పసుల చంటి



**బోథ్, ముద్ర:** కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని ధన్నూర్ బి గ్రామానికి చెందిన పసుల చంటిని మరోమారు పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమించింది. ఈ మేరకు గురువారం పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తన పేరును ప్రకటించినట్లు పసుల చంటి ఒక ప్రకటనలో తెలిపారు. పసుల చంటి 2018 నుంచి పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. స్థానిక సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. తనపై నమ్మకం ఉంచి రెండోసారి ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి, పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్, మాజీ ఎంపీ సోయం బాబూరావు, బోథ్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇంచార్జులు ఆడే గజేందర్, కంది శ్రీనివాస్ రెడ్డి లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శుక్రవారం 20-03-2026
www.mudranews.in | @mudranews


ఉద్యోగాల కోసం నెట్‌వర్కింగ్ పెంచుకోండి
స్నేహితులు, సీనియర్స్, ప్రొఫెషనల్స్‌తో కనెక్ట్ అవ్వండి. చాలా ఉద్యోగాలు రిఫరెన్స్ ద్వారా వస్తాయి.


## క్రీడా మహోత్సవ సభను విజయవంతం చేయాలి

**- సభా స్థలిని పరిశీలించిన బీజేపీ నాయకులు**



ముద్ర ప్రతినిధి, భువనగిరి : భువనగిరి పార్లమెంటరీ నియోజకవర్గంలో జరిగిన ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ విజేతలకు బహుమతి ప్రధానోత్సవ సభను విజయవంతం చేయాలని భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పడమటి జగన్మోహన్ రెడ్డి అన్నారు. ఈ నెల 22న సాయంత్రం భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగే సభాస్థలిని గురువారం బిజెపి నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఈ సభకు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా, అతిథులుగా కేంద్ర సహాయ మంత్రి బి.ఎల్. వర్మ, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, గాయకుడు రాహుల్ సిప్లిగంజ్, ప్రముఖ క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులు, యువతి యువకులు, మేధావులు, విద్యావేత్తలు, రెడ్ క్రాస్, రోటరీ క్లబ్, ఇన్నర్వీల్ క్లబ్, యువజన సంఘాల ప్రతినిధులు ప్రజా ప్రతినిధులు, అధికారులు, అనధికారులు, విద్యార్థులు, రిటైర్డ్ ఉద్యోగులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో భువనగిరి అసెంబ్లీ నియోజక వర్గ కో ఆర్గనైజర్ పట్నం కపిల్, భువనగిరి పట్టణ ఆర్గనైజర్ కట్టమోజు ఉష కిరణ్, బిజెపి నాయకులు నార్ల నర్సింగ్ రావు, చందా మహేందర్, మాయ దశరథ, వైజయంతి, కౌన్సిలర్ బండారు స్వర్ణలత, రత్నపురం శ్రీశైలం, ఏనుగు సతీష్ రెడ్డి, ఎండి మహమ్మద్, తాడూరి కుమార్, నరేష్, భువనగిరి సిద్ధులు పాల్గొన్నారు.

### వీరనారి మల్లు స్వరాజ్యంను

## యువత ఆదర్శంగా తీసుకోవాలి

**- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు యండి జహంగీర్**



ముద్ర ప్రతినిధి, భువనగిరి : నైజం నియంతృత్వానికి ఎదురు నిలిచి పోరాడిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరనారి మల్లు స్వరాజ్యంను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు యండి జహంగీర్ తెలిపారు. గురువారం భువనగిరిలోని సుందరయ్య భవన్ లో మల్లు స్వరాజ్యం వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నైజం రజాకార్లు, దొరలు పరిపాలించిన విధంగా దేశంలో బిజెపి, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు పరిపాలిస్తున్నాయని అన్నారు. బీజేపీ పేద ప్రజల సంక్షేమం మరచి దేశ వ్యాప్తంగా మతోన్మాద బావ జాలాన్ని పెంచి పోషిస్తు ప్రజల మధ్యన విభజన తెస్తుందని విమర్శించారు. అమెరికా చేస్తున్న యుద్ధం అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసే విధంగా ఉందని దీనిపై దేశ ప్రధాని కనీసం స్పందించక పోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, బీఎస్పీ రాష్ట్ర నాయకులు బట్టు రామచంద్రయ్య, సిపిఎం జిల్లా కమిటి సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, దయ్యాల నరసింహ, గడ్డం వెంకటేష్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకులు మహేష్, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి వడ్డెబోయిన వెంకటేష్ సీపీఎం భువనగిరి మండల కార్యదర్శివర్గ సభ్యురాలు కొండమడుగు నాగమణి, చిన్నయ్య, ప్రభాకర్ రెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

## ఉగాది పురస్కారం అందుకున్న యాదాద్రి అర్చకులు





ముద్ర ప్రతినిధి, భువనగిరి : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, శివాలయం ప్రధానార్చకులు జి.నరసింహ మూర్తి గురువారం రవీంద్రభారతిలో సీఎం రేవంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా ఉగాది పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా వారికి దేవాదాయ శాఖ డైరెక్టర్ ఎం.హన్మంత రావు, యాదగిరిగుట్ట దేవస్థాన ఈవో భవాని శంకర్ అభినందనలు తెలిపారు.

## ఆలయాల్లో ఘనంగా ఉగాది వేడుకలు





ముద్ర ప్రతినిధి, భువనగిరి : భువనగిరి పట్టణంలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం శ్రీ పచ్చల కట్ట సోమేశ్వర ఆలయంలో గురువారం పరాభవ నామ సంవత్సరం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కొల్లూరి రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రధాన పూజారి కప్పగంతుల నాగరాజు శర్మ నేతృత్వంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా మున్సిపల్ చైర్మన్ తంగెళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, వార్డు కౌన్సిలర్ తోటకూర విజయలక్ష్మి వెంకటేష్ యాదవ్, కౌన్సిలర్ నాకోటి నాగు, చల్ల గురువుల రఘుబాబు, ఆలయ మాజీ చైర్మన్ దేవరకొండ నరసింహ చారి, గ్యాస్ చిన్నా, బర్రె నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

### తుంగతుర్తి మండల కేంద్రంలో..

ముద్ర, తుంగతుర్తి: తుంగతుర్తి మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ఆలయ అర్చకుడు కాటూరి రామాచార్యులు, శివాలయ అర్చకుడు శంకరమంచి శేషు శర్మల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఏనగందుల సంజీవ్ తో పాటు గ్రామ పెద్దలు పోలవరపు సంతోష్, తాడికొండ సీతయ్య ,కాసం మల్లయ్య, పెండెం యాదగిరి, బండారు దయాకర్, కోల వెంకటరామ నరసయ్య, పెండెం రామ్మూర్తి, తల్లాడ కేదారి, పెద్ద బోయిన అజయ్ ,ఓరుగంటి సుభాష్, ఓరుగంటి శ్రీనివాస్, శవ్వ వెంకటేశ్వర్లు, బండారు వినయ్, వీరబోయిన రాములలతోపాటు పలువురు మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు కౌన్సిలర్ ఆర్థిక సాయం



ముద్ర ప్రతినిధి, భువనగిరి : మున్సిపల్ పట్టణ పరిధిలోని 23వ వార్డు ఇందిరానగర్ కు చెందిన పల్లె పద్మ బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్ కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించి అంత్యక్రియలకు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించారు. వారి వెంట వార్డు నాయకులు బండారు రవి వర్ధన్, గోపి బాబు, బర్రె క్రాంతి, కసరబోయిన సాయికుమార్, భూషపాక యాదగిరి ఉన్నారు.

## పేద ముస్లింలకు రంజాన్ తోఫా



ముద్ర ప్రతినిధి, భువనగిరి : యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామంలో సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ ఆధ్వర్యంలో పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రంజాన్ పవిత్ర మాసంలో ముస్లింలు కఠిన ఉపవాస దీక్షలు చేస్తారని చెప్పారు. గ్రామంలోని పేద ముస్లిం కుటుంబాలకు ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం రంజాన్ కానుకలు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వరిగంటి కృష్ణ, వార్డు సభ్యులు పల్లెపాటి కృష్ణ, ఎస్కే గాలిబి యాకుబ్, బొమ్మరపు రామకృష్ణ, బొమ్మారపు లక్ష్మి బాలరాజు, బిట్కూరు మహేష్, వరిగంటి మానస నాగరాజు, ఎస్కేహైమద్, మాజీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో హోంగార్డు మృతి

ముద్ర, ఖమ్మం: గుండెపోటుతో హోంగార్డు మృతి చెందిన సంఘటన సత్తుపల్లి మండలం రామానగరం గ్రామంలో గురువారం జరిగింది. బంధువులు తెలిపిన ప్రకారం.. ఖమ్మం జిల్లా సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న బుద్ధా శ్రీనివాసరావు(50) గుండెపోటుతో గురువారం రామానగరంలోని స్వగృహంలో మృతి చెందారు. ప్రస్తుతం బుద్ధా శ్రీనివాసరావు గంగారం 15వ బెటాలియన్ లో విధులు నిర్వహిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బుద్ధా శ్రీనివాసరావు మరణవార్త తెలిసిన పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

## నల్ల బెల్లం పట్టివేత

ముద్ర, మహబూబాబాద్: విశ్వసనీయ సమాచారంతో మహబూబాబాద్ జిల్లా టాస్క్ ఫోర్స్, కురవి పోలీస్‌లు కురవి శివారు సోమ్లా తండా వద్ద లారీని అడ్డగించి తనిఖీ చేయగా 70 క్వింటాళ్ల నల్ల బెల్లం, పది క్వింటాళ్ల పట్టిక పట్టుబడింది. వెంటనే వాటిని స్వాధీనం చేసుకుని, లారీని సీజ్ చేసి రవాణా చేస్తున్న మహబూబాబాద్ కు చెందిన గుగులోత్ సుమన్ ఆరెపల్లి మధు, బొల్లా విజయ్ కుమార్ లను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## శ్రీ రామాయణ కృతు మహా యజ్ఞం ప్రారంభం

**- పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు ప్రవచనం..**



ముద్ర ప్రతినిధి, భువనగిరి : శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు గురువారం స్వర్ణగిరిలో వైభవంగా జరిగాయి. నిత్య ఆరాధనలు అనంతరం ఉగాది పచ్చడిని భక్తులకు అందజేశారు. అనంతరం వసంత నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీ రామాయణ కృతు మహా యజ్ఞంను ప్రారంభించారు. ఉదయం 8 గంటలకు శ్రీ సీతా రామచంద్ర లక్ష్మణులకు పంచ వింశత కలశ స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి కొలువుదీర్చారు.

ఉగాది ఆస్థానంలో భాగంగా ఆలయ స్థానాచార్యులు దిట్టకవి శ్రవణ్ కుమారాచార్యులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం శ్రీ రామాయణ కృతు మహా యజ్ఞంనకు అంకురార్పణ చేశారు.

సాయంత్రం శ్రీవారికి కల్పవృక్ష వాహన సేవ నిర్వహించారు. శ్రీవారి వైభవోత్సవ మండపంలో "కాల ప్రభావము – కలి యుగ దైవము" అన్న అంశంపై పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ గరికపాటి నరసింహారావు ప్రవచనం చేశారు. ఈ కార్యక్రమాలలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మానేపల్లి రామారావు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. అన్న ప్రసాద వితరణలో భాగంగా సుమారు 3000 మందికి పైగా భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.






## పోలీస్ తనిఖీల్లో గంజాయి ముఠా అరెస్ట్

ముద్ర, సూర్యాపేట: మండల పరిధిలోని అనంతారం ఎక్స్ రోడ్డు వద్ద పెన్‌పహాడ్ పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారు. గురువారం ఉదయం ఎస్సై గోపి కృష్ణ తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టగా, స్కూటీపై వస్తున్న ముగ్గురు యువకులు పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకొని విచారించగా గంజాయి తరలిస్తున్నట్లు తేలింది. నిందితులు సుమారు నాలుగు రోజుల క్రితం ఒరిస్సా సరిహద్దు ప్రాంతాల్లో 2 కేజీల గంజాయిని కొనుగోలు చేసి, అందులో కొంత భాగాన్ని తాము సేవించి, మిగిలిన 1.700 కేజీల గంజాయిని సూర్యాపేటలో విక్రయించేందుకు తరలిస్తుండగా పోలీసులకు చిక్కారు. గంజాయి తాగే అలవాటున్న ఈ ముగ్గురు స్నేహితులుగా మారినట్లు సమాచారం. అరెస్ట్ అయిన వారిలో మాచారం గ్రామానికి చెందిన ప్లంబర్ బొమ్మకంటి గోపి (26), ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలుకు చెందిన వెల్డింగ్ కార్మికుడు చింతల వెంకటేష్ (26), పెన్‌పహాడ్ గ్రామానికి చెందిన పెయింటర్ వొగ్గు ఈశ్వర్ (22) ఉన్నారు. పోలీసులు వారి వద్ద నుండి 1.700 కిలోల గంజాయి, రెండు సెల్ ఫోన్లు, స్కూటీ (ఏపీ–39–జేవై–1357)ని స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీ ఎస్సై గోపి కృష్ణ, కానిస్టేబుళ్లు జోసెఫ్ మధుకర్, లింగరాజు, ప్రవీణ్ పాల్గొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.


**ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూ ప్రాక్టీస్ చేయండి**

సాధారణ ప్రశ్నలకు ముందుగానే సిద్ధంగా ఉండండి. మాక్ ఇంటర్వ్యూలతో ఆత్మవిశ్వాసం పెంచుకోండి.



## ఏడుపాయల వనదుర్గకు ప్రత్యేక అలంకరణ

- వేలాది మంది భక్తుల దర్శనం



**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవం శ్రీ ఏడుపాయల వనదుర్గ మాత అమ్మవారిని ఉగాది సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రతి అలంకరణ అనంతరం భక్తులకు దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. తెల్లవారుజామున అమావాస్య ఘడియలు కూడా ఉండటంతో భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. మెదక్, హైదరాబాద్, కామారెడ్డి జిల్లాలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

## మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- సర్పంచ్ సాయిలు
- బూరుగుపల్లిలో ఇఫ్తార్ విందు



**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని బూరుగుపల్లి సర్పంచ్ సాయిలు అన్నారు. హవెలి ఘనపూర్ మండలం బూరుగుపల్లిలో గురువారం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. సర్పంచ్ సాయిలు ముఖ్యఅతిథిగా ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అన్ని మతాలను గౌరవించడం మన ఐక్యతకు నిదర్శనమన్నారు. పవిత్ర రంజాన్ ఉపవాసం ఎంతో ముఖ్యమన్నారు. మైనారిటీ సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థన చేసి ఉపవాస దీక్ష విరమణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిట్యాల శ్రీనివాస్, నర్సింహులు, సాయిబాబా, దుర్గయ్య, లెంక రాజు, లెంక బాబు, సుధాకర్, బిఆర్ఎస్ నాయకులు బాలరాజ్, వెంకట్, ఉప సర్పంచ్ రాజు, వార్డు సభ్యులు రమేష్, సాయిలు, కృష్ణ, సన్నీ, ప్రజాప్రతినిధులు, మత పెద్దలు నాయకులు, కార్యకర్తలు ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## 61 మందితో డిసిసి కార్యవర్గం

**ముద్ర ప్రతినిధి, మెదక్:**





61 మందితో మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గంను పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించారు. ఇందులో 14 మంది ఉపాధ్యక్షులు, 20 మంది ప్రధాన కార్యదర్శులు, 20 మంది కార్యదర్శులు, ఆరుగురు అధికార ప్రతినిధులు, ఒక కోశాధికారి ఉన్నారు. మెదక్ మున్సిపల్ కౌన్సిలర్లు కే.హరిత ఉపాధ్యక్షురాలుగా , తౌడుపునూరి శివరామకృష్ణ కోశాధికారిగా అవకాశం లభించింది. డిసిసి అధ్యక్షులుగా నర్సాపూర్ కు చెందిన ఆంజనేయులు గౌడ్ నియామకమైన విషయం తెలిసిందే. జిల్లా కార్యవర్గంలో చోటు కల్పించడం పట్ల పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## 'యువత అన్ని రంగాల్లో రాణించాలి'

**ముద్ర న్యూస్ :**



యువత చదువుతో పాటు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరిచి రాణించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సునీల్ రాథోడ్ అన్నారు. బీర్కూర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులంలో, దుర్కి గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం 'మేరా యువ భారత్' ఆధ్వర్యంలో విద్యార్థులకు కబడ్డీ, చదరంగం, పరుగు పందెం, వాలీబాల్, తాడు లాగడం, స్కిప్పింగ్ వంటి క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు గోపాల్, ఐశ్వర్య పాల్గొన్నారు.

### జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా సాయాగౌడ్


కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండల కేంద్రానికి చెందిన మంతపూరి సాయాగౌడ్‌ను జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా నియమించారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# వైభవంగా ఉగాది ఉత్సవాలు

- పలు ఆలయాల్లో పంచాంగ పఠనం, బండ్ల ఉత్సవం

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**





మెదక్ పట్టణంలోని శ్రీ కోదండ రామాలయంలో ఉగాది ఉత్సవాలు వైభవంగా జరిగాయి. సాయంత్రం స్వామివారి సన్నిధిలో నిర్వహించిన పంచాంగ పఠనంలో మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధికా భూపతిరాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్‌గౌడ్, కౌన్సిలర్లు మాయా గంగమణి మల్లేశం, తౌడుపునూరి శివరామకృష్ణ, మామిళ్ళ ఆంజనేయులు బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్షులు నరేందర్ భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. వైద్య శ్రీనివాస్ పంచాంగ పఠనం అనంతరం పచ్చడి, తీర్థ ప్రసాద వితరణ గావించారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు విశేషంగా కట్టుకున్నాయి.

**వేంకటేశ్వర స్వామి ఆలయంలో పంచాంగ పఠనం..**

ఉగాది సందర్భంగా తెలుగు నూతన సంవత్సరం పరాభవ నామ సంవత్సరం పురస్కరించుకొని మెదక్ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పంచాంగ పఠనం నిర్వహించారు. పురోహితులు వైద్య శ్రీనివాస్ పంచాంగ పఠనం చేయగా, ఆలయ అర్చకులు నరేంద్రాచార్య, జితేందర్, ఆలయ కమిటీ బాధ్యులు గడ్డం కాశీనాథ్, నాగరాజ్, వెంకటేష్, వార్డ్ కౌన్సిలర్ పబ్బ రాజమణి లక్ష్మణ్, భక్తులు పాల్గొన్నారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ ఏడాది నవనాయకులలో ఏడుగురు శుభఫలితాలు ఇచ్చేవారు ఉండటంతో మంచి ఫలితాలు ఉంటాయని ప్రముఖ పురోహితుడు వైద్య శ్రీనివాస్ శర్మ తెలిపారు. రాజుగా గురుడు, సైన్యాధిపతిగా చంద్రుడు, ధాన్యాధిపతిగా బుధుడు ఉన్నారని వివరించారు. ఈ ఏడాది నాలుగు భాగాల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, యమునా పుష్కరాలు ఉండగా ఎలాంటి గ్రహణాలు లేవని చెప్పారు. అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడంతో పాటు రహదారులు మెరుగ్గా నిర్మించబడతాయని తెలిపారు.

**అయ్యప్ప ఆలయంలో..**

మెదక్ పట్టణంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా వైద్య రాజు పంతులు పంచాంగ పఠనం చేశారు. భక్తులు పాల్గొన్నారు. ఈ ఏడాది నవనాయకులలో ఏడుగురు శుభ ఫలితాలు ఇచ్చే వారుండటంతో అంతా మంచే జరుగుతుందని పేర్కొన్నారు. రాజుగా గురుడు, సైన్యాధిపతిగా చంద్రుడు, ధాన్యాధిపతిగా బుధుడు ఉన్నారని వివరించారు. ఈ ఏడాది 4 భాగాల వర్షం కురిసే అవకాశం ఉందని, యమునా పుష్కరాలు ఉండగా ఎలాంటి గ్రహణాలు లేవని ఆయన వివరించారు. అన్ని రంగాల్లో కూడా అభివృద్ధి సాధించడంతో పాటు రహదారులు చాలా గొప్పగా నిర్మించబడతాయన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, పచ్చడి వితరణ చేశారు.

**గ్రామ దేవతలకు బండ్ల ఉత్సవం..**

ఉగాది తెలుగు నూతన సంవత్సరం పురస్కరించుకుని పట్టణంలోని అవుసులపల్లి, మండలంలోని పాతూర్, రాజ్ పల్లి గ్రామాల్లో గ్రామ దేవతలకు ఉత్సవాలు నిర్వహించారు. మెదక్ మున్సిపాలిటీ పరిధిలో గల ఆవుసులపల్లిలో గ్రామ దేవతలకు బండ్ల ప్రదర్శన, బోనాలు సమర్పించారు. ఉత్సవాలకు గ్రామదేవతలు నల్ల పోచమ్మ, దుర్గమ్మ, మత్తడి పోచమ్మ, మైసమ్మ, ముత్యాలమ్మ, ఆలయాలను ముస్తాబు చేశారు. ఉగాది పండుగ ఉత్సవాల సందడి నెలకొంది.



# సాంకేతికతతో వ్యవసాయంలో అద్భుతాలు

- మంత్రి పొన్నం ప్రభాకర్

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



వ్యవసాయానికి సాంకేతికత తోడైతే అద్భుతాలు చేయొచ్చని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం నర్మేటలో ప్రారంభం కానున్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ వద్ద గురువారం రైతు స్టాల్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. రైతు ఉత్సవాల్లో భాగంగా 150 స్టాల్స్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. శాస్త్రవేత్తలతో పంటల మార్పిడి పై అవగాహన, సాంకేతికతను ఉపయోగించి వ్యవసాయ పద్ధతులు, అధిక దిగుబడి ఇచ్చే వంగడాలపై వచ్చే మూడు రోజుల పాటు వివిధ స్టాల్స్ ద్వారా అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. కరీంనగర్, సిద్దిపేట, జనగాం, మెదక్, భువనగిరి, హనుమకొండ, వరంగల్ జిల్లాల నుంచి రైతులు వచ్చి అవగాహన పొందాలని సూచించారు. ఈనెల 22వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నర్మేట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభిస్తారని తెలిపారు. ఇక్కడ గంటకు 30 టన్నులు క్రషింగ్ చేసే అధునాతన యంత్రాలు ఉన్నాయని చెప్పారు. పంటల ఉత్పత్తి పెరిగితే గంటకు 150 టన్నుల వరకు క్రషింగ్ సామర్థ్యం ఉంటుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా లక్ష కోట్ల విలువైన ఆయిల్ దిగుమతి కారణంగా విదేశీ మారక ద్రవ్య నష్టం జరుగుతోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహంతో అంతర పంటలు వేసుకోవచ్చని చెప్పారు. ఈ ప్రాంత రైతులు ఆయిల్ పామ్ సాగు చేయాలని సూచించిన మంత్రి, సిద్దిపేట నియోజకవర్గంతో పాటు హుస్నాబాద్ రైతులు కూడా ఈ సాగులో ముందుండాలని అన్నారు. కోహెడ మండలంలోనే అత్యధికంగా ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని తెలిపారు. ఉగాది పండుగ సందర్భంగా రైతులకు ప్రయోజనం కలిగేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. గుజరాత్‌లో పాల ఉత్పత్తి పెంపులో కురియన్ చేసిన కృషిలా, తెలంగాణలో ఆయిల్ పామ్ ఉత్పత్తి పెంపులో తుమ్మల నాగేశ్వరరావు పాత్ర ఉందని కొనియాడారు. ఆయిల్ పామ్‌కు రాజకీయాలకు సంబంధం లేదని స్పష్టం చేశారు. 2021లో క్యాబినెట్‌లో ఈ ఫ్యాక్టరీకి ఆమోదం లభించగా, ప్రస్తుత క్యాబినెట్‌లో తుమ్మల నాగేశ్వరరావు నిధులు కేటాయించి పూర్తి చేశారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా రైతు సంక్షేమానికి కృషి చేస్తామని మంత్రి తెలిపారు.



## ఉగాది పరమార్థం

శిశిరం పిదప అరుదెంచును వాసంతం
వాసంతంలో వనప్రియపు మధుర గానం
మధుర గానముతో వచ్చును ఉగాది సంరంభం
ఉగాదితో తెలుగు వత్సరం ప్రారంభం

ఆధ్యాత్మికతతో త్రుంచు అహంకారం
వినయమే నీకు అలంకారం
ఇకపై సాగించు కొత్త జీవనం
అని తెలియజేయుచున్నది
శ్రీ పరాభవ నామ సంవత్సరం

షడ్రుచుల సమ్మేళనం
ఉగాది పచ్చడి ప్రత్యేకం
కష్ట సుఖాలను సంయమనంతో
స్వీకరించవలెనని అందించు సందేశం

ఆదాయ ఫలాల
అదృష్ట సంఖ్యల
పంచాంగ శ్రవణంతో పునీతం
ఆపై పండితుల ఆశీర్వాదం

ఓటమి మిగిల్చు చేదు అనుభవం
గెలుపు తెచ్చును తీపి వసంతం
ఇదే ఉగాది పర్వదిన పరమార్థం



కానుగు రాధిక.. భూపతి రాజు
చైర్ పర్సన్ మెదక్ పురపాలక సంఘం

- ముద్ర ప్రతినిధి, మెదక్ :

# మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో అసమానతలపై పోరాటం చేయాలి

- సిపిఎం నేత చుక్క రాములు పిలుపు

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :**



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరవనిత కామ్రేడ్ మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో నేటి యువతరం సమాజంలోని ఆర్థిక దోపిడి, అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కామ్రేడ్ చుక్క రాములు పిలుపునిచ్చారు. గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కార్మిక కర్షక భవనంలో మల్లు స్వరాజ్యం 4వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ, నేడు అధికారంలో ఉన్న పాలకులు అసమానతలు పెంచుతూ ఆర్థిక దోపిడికి గురిచేస్తున్నారని ఆరోపించారు. సామాన్యులకు సౌకర్యాలు అందుబాటులో లేకుండా చేస్తూ పేదవారిని మరింత పేదవారిగా మార్చే విధంగా ఆర్థిక విధానాలు అమలు చేస్తున్నారని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాద దేశమైన అమెరికా తన ఆధిపత్యం కోసం స్వతంత్ర దేశాలపై ఆధిపత్యం సాధించేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. ఇరాన్‌పై జరుగుతున్న యుద్ధ నేపథ్యంలో, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ, దేశ అలీన విధానానికి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. మిత్ర దేశమైన ఇరాన్‌పై దాడులు జరుగుతున్నప్పటికీ, ప్రపంచ శాంతి కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. యుద్ధం కారణంగా ఏర్పడిన గ్యాస్ సంక్షోభంపై ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇదే అదనుగా చూసుకుని గ్యాస్ కంపెనీలు ధరలు పెంచి పేదలను దోచుకుంటున్నాయని ఆరోపించారు. గ్యాస్ కొరత లేదని బీజేపీ నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గ్యాస్ సంక్షోభంతో ఏర్పడిన ఆర్థిక అసమానతలను తగ్గించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వెంటనే తగు చర్యలు తీసుకుని గ్యాస్ సరఫరాను సమృద్ధిగా అందించాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, రాళ్లబండి శశిధర్, సందబోయిన ఎల్లయ్య, శెట్టిపల్లి సత్తిరెడ్డి, గొడ్డుపర్ల భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్, జాలిగపు శిరీష, దాసరి ప్రశాంత్, నాయకులు కొండం సంజీవ్ కుమార్, బత్తుల అభిషేక్ బాన్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
20.03.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



ఉద్యోగాల కోసం ఆన్‌లైన్ ప్రొఫైల్ అప్డేట్ చేయండి
LinkedIn వంటి ప్లాట్‌ఫారమ్‌లలో ప్రొఫైల్ మెరుగుపరచండి.
మీ ప్రొఫైల్ చూసి కూడా అవకాశాలు వస్తాయి.
Linked in

### మనవడి కోసం... రేపు తిరుమలకు
# సీఎం చంద్రబాబు



**ముద్ర డెస్క్ :**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు తిరుమలకు వెళ్లనున్నారు. మనవడు నారా దేవాన్ష్ జన్మదినాన్ని పురస్కరించుకుని కుటుంబ సభ్యులతో కలిసి రెండు రోజుల పాటు తిరుమలలో పర్యటించనున్నారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా శ్రీవారిని దర్శించుకోవడం ప్రత్యేకతగా నిలుస్తోంది. శుక్రవారం సాయంత్రం తిరుపతిలోని అగ్రికల్చర్ యూనివర్సిటీ హెలిపాడ్‌కు చేరుకునే సీఎం, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో తిరుమలకు చేరుకుని శ్రీపద్మావతి అతిథిగృహంలో బస చేయనున్నారు. శనివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనం అనంతరం తరిగొండ వెంగమాంబ సత్రంలో దేవాన్ష్ జన్మదినం సందర్భంగా అన్నదానం నిర్వహించనున్నారు. భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించనుండటం విశేషం. ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా ఒక్క రోజు అన్నప్రసాదానికి అయ్యే వ్యయాన్ని టీటీడీకి విరాళంగా అందజేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లను కట్టుదిట్టంగా చేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని సీఎం చంద్రబాబు తెలుగు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం, అభివృద్ధి తీసుకురావాలని ఆకాంక్షించారు.

# ఉద్యోగుల నగదు రహిత వైద్యం ఎప్పుడు?

- **సమావేశాల ఆర్భాటమే కానీ... ఆచరణ ఎక్కడ?**

**ముద్ర న్యూస్ :**



**ఇంజమూరి రఘునందన్**
**(సెల్:9866102962)**
**పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు**

రూ.1.2 కోట్ల బీమాతో పాటు క్యాష్‌లెస్ ఎంప్లాయ్ హెల్త్ స్కీమ్‌ను ఫిబ్రవరి 23న జరిగిన మంత్రివర్గ సమావేశంలో కేబినెట్ ఆమోదించింది. ఉద్యోగుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆ సందర్భంగా సీఎంవో నుంచి ప్రకటన విడుదలైంది. ఉద్యోగులు, పెన్షనర్లు తమ మూల వేతనాల నుంచి 1.5 శాతం వైద్య నిధికి చెల్లించాలని, అంతే మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తూ హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు చేసి నాణ్యమైన కార్పొరేట్ స్థాయి నగదు రహిత వైద్య సౌకర్యాలు కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అయితే, ఈ ప్రకటన చేసి దాదాపు నెల రోజులు గడిచినా ఇప్పటికీ ఎలాంటి జీఓ విడుదల కాలేదు. ఇంతకుముందు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ సంఘాలతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధ్యక్షతన పలుమార్లు ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు నగదు రహిత వైద్యం అందిస్తామని, ప్రమాదంలో మరణిస్తే కోటి రూపాయల బీమా కల్పిస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు. సమావేశాలు, ప్రకటనలకే పరిమితమవుతున్న ప్రభుత్వ చర్యలపై విశ్వాసం సన్నగిల్లుతుంది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ సిబ్బందికి చెల్లించాల్సిన ఉద్యోగ విరమణ బకాయిలు, ఇతర బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హోమ్ లోన్ బకాయిలు చెల్లించలేక, పిల్లల పెళ్లిళ్లు తదితర అవసరాల నేపథ్యంలో మానసిక ఆందోళనకు గురవుతున్నారు. సరైన సమయంలో వైద్యం పొందలేక శస్త్ర చికిత్సలను వాయిదా వేయాల్సి వస్తోందని వాపోతున్నారు. పెన్షన్ బకాయిల కోసం ఎదురుచూస్తూ ఇప్పటికే 60 మందికి పైగా పెన్షనర్లు మరణించినట్లు సమాచారం. రావలసిన పెన్షన్ బకాయిలు అందకపోవడం, నగదు రహిత వైద్య పథకం అమల్లోకి రాకపోవడంతో ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోవడానికి అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అయినా ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా ఉద్యోగుల నగదు రహిత వైద్య పథకానికి సంబంధించిన విధి విధానాలపై జీఓలను వెంటనే జారీ చేయాలని రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఆశాభావంతో ఎదురుచూస్తున్నారు.

# అసెంబ్లీ విప్‌లుగా ముగ్గురు

- **విజయరమణా రావు, యెన్నం, వేములకు కీలక బాధ్యతలు**
- **ఉత్తర్వులు జారీ చేసిన సర్కార్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



రాష్ట్ర శాసనసభలో ప్రభుత్వ కార్యకలాపాలను మరింత వేగవంతం చేసేందుకు, సభా వ్యవహారాలను సమన్వయం చేసేందుకు వీలుగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముగ్గురు ఎమ్మెల్యేలను అసెంబ్లీ విప్‌లుగా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణా రావు, మహబూబ్ నగర్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం విప్‌లుగా నియమితులైన వారిలో ఉన్నారు. శాసనసభలో ఏదైనా బిల్లుపై ఓటింగ్ జరిగినప్పుడు లేదా ముఖ్యమైన చర్చలు జరిగినప్పుడు అధికార పార్టీ ఎమ్మెల్యేలందరూ హాజరయ్యేలా చూడటంలో విప్‌ల పాత్ర అత్యంత కీలకం. ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఎవరూ ఓటు వేయకుండా పార్టీ లైన్‌ను అమలు చేయడం వారి ప్రధాన బాధ్యత. బడ్జెట్ సమావేశాలు, ఇతర కీలక సెషన్ల నేపథ్యంలో ఈ నియామకాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. రాజకీయంగా అనుభవం ఉన్న నాయకులకు ఈ బాధ్యతలు అప్పగించడం ద్వారా సభలో ప్రభుత్వ పట్టును మరింత బలోపేతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. తాజా నియామకాలపై సదరు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రికి, పార్టీ అధిష్టానానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.





# సాదా బైనామా భూములకు త్వరలోనే పరిష్కారం

- **ఉగాది వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి**
- **వ్యవసాయాన్ని లాభసాటిగా చేసి రైతును రాజుగా చేస్తాం**
- **ఈ నెల 22 నుంచి రైతు భరోసా అందిస్తాం**
- **భూ భారతితో రైతాంగ సమస్యలకు పరిష్కారం చూపుతున్నాం**
- **తెలంగాణలో దేశంలోనే అతితక్కువ రుణభారం ఉన్న రైతులున్నారు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణలో సాదా బైనామా భూములకు సంబంధించి తొందరలోనే పరిష్కారం చూపించబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా చేసి రైతును రాజుగా నిలబెట్టాలన్న సంకల్పంతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. ఉగాది పండుగను పురస్కరించుకుని భాషా సాంస్కృతి శాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో నిర్వహించిన శ్రీ పరాభవ నామ ఉగాది వేడుకల్లో సీఎం, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్రీ పరాభవ నామ ఉగాది పంచాంగాన్ని ఆవిష్కరించారు. ప్రకృతి వైపరీత్యాలు రాకుండా ప్రజలు సుఖశాంతులతో వర్థిల్లాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ నెల 22న రైతు భరోసా అందించబోతున్నామని తెలియజేస్తూ రైతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. రైతు సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ప్రభుత్వం పనిచేస్తుందని పునరుద్ఘాటించారు. ధరణి రూపంలో భూతమై రైతులను బాధ పెడుతున్న సందర్భంగా రైతులకు అండగా దాన్ని తరిమేసి భూ భారతితో రైతాంగ సమస్యలను పరిష్కరిస్తున్నట్లు వివరించారు. సాదా బైనామాకు సంబంధించి తొందరలోనే పరిష్కారం చూపించబోతున్నామని చెప్పారు. సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న రైతాంగాన్ని గట్టెక్కించడానికి పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు బోనస్ కూడా ఇచ్చి ఆదుకుంటున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన లెక్కల మేరకు దేశంలో అతితక్కువ రుణభారం కలిగిన రైతులున్న రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో ఉండటం గర్వకారణమన్నారు. పరిశ్రమలు ఎన్ని వచ్చినా, ఐటీ రంగాలు ఎంతగా రాణించినప్పటికీ రాష్ట్రంలో ఇప్పటికీ ప్రధాన జీవనాధారం వ్యవసాయమేనని చెప్పారు. రైతులు బాగున్నప్పుడే రాష్ట్రం బాగుంటుందన్న సీఎం... రాష్ట్రంలో 25.35 లక్షల రైతు కుటుంబాలకు రూ. 20,616 కోట్ల మేరకు రుణమాఫీ చేసి రైతులను ఆత్మగౌరవంతో బతకడానికి ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని వివరించారు. ప్రతి ఎకరాకు రూ. 12 వేల చొప్పున రైతు భరోసా అందిస్తున్నామనీ ఇప్పటికే రూ. 18 వేల కోట్లు రైతు భరోసా కింద అందించినట్లు చెప్పారు. పండించిన పంటలపై రైతుల్లో విశ్వాసం కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. వ్యవసాయ రంగానికి ఉచిత కరెంట్, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, రుణమాఫీ చేయడం, రైతుభరోసా అందించడంతో పాటు రైతు బీమా అమలు చేయడం వంటివన్నీ రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం తీసుకున్న నిర్ణయాలన్నారు. ప్రభుత్వం రైతుల కోసం ప్రయత్నాలు, నిర్మిస్తున్న సాగునీటి ప్రాజెక్టులు, సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలన్నీ దేశంలో తెలంగాణ ప్రతిష్టను పెంపొదిస్తాయన్నారు. మన పొలాల్లో సమృద్ధిగా పంటలు పండినప్పుడే రాష్ట్రం సుఖశాంతులతో విలసిల్లుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. కాగా ఈ వేడుకల్లో ప్రముఖ జ్యోతిష్యులు డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ఆలయాలకు చెందిన అర్చకులను సీఎం రేవంత్ రెడ్డి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# త్వరలోనే 'తెలంగాణ ప్రజా జాగృతి'

- **కొత్త పార్టీపై కవితకు ఢిల్లీ హైకోర్టులో ఊరట**
- **పార్టీ అంశంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఈసీకి ఆదేశాలు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

కొత్త రాజకీయ పార్టీ నమోదు వ్యవహారంలో కల్వకుంట్ల కవితకు ఢిల్లీ హైకోర్టులో ఊరట లభించింది. కవిత కొత్త పార్టీ అంశంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఈసీకి సూచించింది. 'తెలంగాణ ప్రజా జాగృతి' పేరుతో నూతన రాజకీయ పార్టీ నమోదు కోసం కవిత ఈ ఏడాది జనవరి 23న కేంద్ర ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ విషయంలో ఈసీ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరిగింది, దీంతో తమ దరఖాస్తును కేంద్ర ఎన్నికల సంఘం వేగంగా పరిశీలించి నిర్ణయం వెలువరించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఇటీవల కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. కవిత పిటిషన్‌పై గురువారం విచారణ జరిపిన కోర్టు.. తెలంగాణ ప్రజా జాగృతిపై వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌కు సూచించింది. కవిత దరఖాస్తులో లోపాలున్నాయని గతంలో కోర్టుకు ఎన్నికల కమిషన్ చెప్పగా లోపాలన్నీ సరిచేసినట్లు తాజాగా కవిత తరఫున న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. సాంకేతిక తప్పులు సరిచేసి ఈసీకి మళ్లీ దరఖాస్తు చేశామని కోర్టుకు వివరించారు. ఈసీ స్పందిస్తూ కవిత కొత్త పార్టీ దరఖాస్తుపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది. ఈసీ త్వరగా నిర్ణయం తీసుకుంటామనడంతో కోర్టు విచారణ ముగించింది.

# రూ.2,15,200 కోట్లతో జాగృతి ప్రజా బడ్జెట్

- **ఇక నుంచి ఏటా ఉగాది రోజు జాగృతి ప్రజా బడ్జెట్**
- **తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**
- **రాష్ట్ర కార్యాలయంలో పంచాంగ శ్రవణం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రూ.2,15,200 కోట్లతో ప్రజాబడ్జెట్ ను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రతిపాదించారు. ఉగాది సందర్భంగా తెలంగాణ జాగృతి తరఫున ప్రజా బడ్జెట్ ప్రవేశ పెడుతున్నామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. ఇక నుంచి ఏటా ఉగాది రోజు జాగృతి తరఫున ప్రజా బడ్జెట్ ఉంటుందన్నారు. గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు పంచాంగ శ్రావణం చేశారు. ఉగాది వేడుకల్లో కల్వకుంట్ల కవిత, అనిల్ దంపతులు, తెలంగాణ జాగృతి ముఖ్య నాయకులు పాల్గొన్నారు. వేడుకల అనంతరం తెలంగాణ జాగృతి ప్రజాబడ్జెట్ ప్రతిపాదనలను కవిత ప్రకటించారు. ఈ ఏడాది రూ. 2 లక్షల 15 వేల 2 వందల కోట్లతో ప్రజాబడ్జెట్ ప్రతిపాదిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొత్తంగా రూ. 3 లక్షల కోట్లకు పైగా అంచనాలతో రేపు బడ్జెట్ ప్రవేశపెట్టనుందని, తాము మాత్రం రూ. 2 లక్షల 15 వేల కోట్లతోనే బడ్జెట్ ప్రతిపాదిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వానికి అదనంగా మరో రూ. లక్ష కోట్ల వరకు బడ్జెట్ కేటాయింపులు చేసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. ఆ మొత్తం గాంధీ కుటుంబ సభ్యులే కాదు తమకు నచ్చిన వారి పేర్లతో పథకాలు ప్రకటించుకోవచ్చన్నవారు. తాము ప్రతిపాదించిన మొత్తం ప్రజా సంక్షేమం, రాష్ట్ర పురోగతికి ఉపయోగపడేలా ఉంటుందని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన సూచనల మేరకే తాము ఈ ప్రజా బడ్జెట్ ను కేటాయించామన్నారు. ప్రజా బడ్జెట్ లో విద్య, వైద్యం, సంక్షేమానికి పెద్ద పీట వేశారు.

**ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు**

ఉగాది కొత్త సంవత్సరం ఆరంభానికి నాంది అని కవిత అన్నారు. ఉగాది రోజు మంచి చేసేలా జాగృతి నాయకులు, కార్యకర్తలంతా కంకణబద్ధలవ్వాలని పిలుపునిచ్చారు. శ్రీ పరాభవనామ సంవత్సరం సందర్భంగా జాగృతి కార్యాలయంలో పంచాంగ శ్రావణం జరపటం ఆనందంగా ఉందన్నారు. ఈ ఏడాది తెలుగు ప్రజలు, తెలంగాణ ప్రజలకు మంచి జరగాలని ఆకాంక్షించారు.

# అట్టహాసంగా గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం

- **ఉగాది వేడుకల్లో గద్దర్ ఫిల్మ్ అవార్డుల ఘన ప్రదానోత్సవం**
- **సీఎం రేవంత్ రెడ్డి, భట్టి చేతుల మీదుగా అవార్డుల అందజేత**
- **హైటెక్స్‌లో సినీ తారల సందడి.. కమల్ హాసన్ ముఖ్య అతిథి**
- **విజేతలకు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాల ప్రదానం**
- **జ్యూరీ సభ్యులకు గోల్డెన్ మెమెంటో, లక్ష రూపాయల నగదు బహుమతి**



**ముద్ర డెస్క్ :**

ఉగాదిని పురస్కరించుకుని తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా జరిగింది. మాదాపూర్ హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్ ఈ వేడుకకు వేదికైంది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రముఖ నటుడు చిరంజీవి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక సంచికను భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ద్వారా సర్టిఫికెట్ పొందిన చిత్రాలకు సంబంధించి ఇప్పటికే విజేతల వివరాలను ప్రకటించిన సంగతి తెలిసిందే. వారిలోని పలువురికి డిప్యూటీ సీఎం పురస్కారాలు అందజేశారు. ఉత్తమ చిత్రం,ఉత్తమ నటుడికి , ఉత్తమ దర్శకుడికి సీఎం రేవంత్ రెడ్డి అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కోలీవుడ్ అగ్రహీరో కమల్ హాసన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రశంసా పత్రంతోపాటు నగదు ప్రోత్సాహకాన్ని విజేతలు అందుకున్నారు. జ్యూరీ కమిటీకి గోల్డెన్ మెమెంటో, ప్రశంసా పత్రంతోపాటు రూ .లక్ష నగదు ప్రోత్సాహకాన్ని టీఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజు అందజేశారు.

ఉద్యోగాల కోసం ప్రతిరోజూ అప్లై చేయండి
రోజు కనీసం కొన్ని ఉద్యోగాలకు అప్లై చేయండి.
నిరంతర ప్రయత్నమే ఫలితాన్ని ఇస్తుంది.


# ఏరోలైఫ్ మినీ ఆవిష్కరణ

**ముద్ర, డెస్క్:**




వినూత్న ఆవిష్కరణల ఆధారిత లైఫ్ సైన్సెస్ కంపెనీగా అంతర్జాతీయంగా కార్యకలాపాలు సాగిస్తున్న జైడస్ లైఫ్‌సైన్సెస్ లిమిటెడ్, రెస్పిరేటరీ సంరక్షణలో డ్రగ్ డివైజ్ ఆధారిత ఉత్పత్తులకు తోడ్పడే వ్యూహంలో భాగంగా కీలక ముందడుగు వేసింది. కొత్త తరం పీఎండీఐ ఎన్హాన్సర్ అయిన ఏరోలైఫ్ మినీని ఆవిష్కరించింది. ఇది సులభతరంగా వినియోగించేందుకు వీలుండే భారతదేశపు తొలి పోర్టబుల్, ఫోల్డబుల్ స్పేసర్. ఏరోడెల్ టెక్నాలజీ ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఎక్స్‌క్లూజివ్ లైసెన్సింగ్ ఒప్పందం కింద జైడస్ ఈ డివైజ్‌ని ఆవిష్కరించింది. వాయు కాలుష్యం, స్మోకింగ్, అంటువ్యాధులు, రోగ నిర్ధారణ పరీక్షల్లో జాప్యం కారణాల వల్ల భారత్‌లో ఆస్థమా, అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ (సీవోపీడీ), బ్రాంకియాక్టసిస్‌లాంటి శ్వాస సంబంధ వ్యాధులు పెరుగుతున్నాయి. ఈ లక్షణాలను నియంత్రించుకునేందుకు, పెరగకుండా తగ్గించుకునేందుకు, నాణ్యమైన జీవనాన్ని సాగించేందుకు కోట్ల మంది పేషంట్లు దీర్ఘకాలిక ఇన్‌హేల్డ్ థెరపీపై ఆధారపడుతున్నారు. ఇన్‌హేల్డ్ ఔషధాలు, చికిత్సకు కీలకమే అయినప్పటికీ ఊపిరితిత్తులకు ఔషధాన్ని సమర్ధవంతంగా చేర్చడమనేది పెద్ద సవాలుగా ఉంటోంది. వాస్తవ ప్రపంచపు అధ్యయాల ప్రకారం ఇన్‌హేలర్ టెక్నిక్ చాలా సందర్భాల్లో పూర్తి స్థాయిలో ఉండటం లేదు. ఏరోలైఫ్ మినీ ఒక పొందికైన, మడతబెట్టతగిన విధంగా, వినియోగించడానికి సర్వ సన్నద్ధంగా ఉండేలా డిజైన్ చేయబడింది. ఔషధం మరింత మెరుగ్గా లోన పేరుకునేందుకు తోడ్పడుతూ పేషంట్లకు మరింత సౌకర్యవంతంగా, వారికి ధీమానిచ్చే విధంగా ఉంటుంది. పేషంట్ల ప్రయోజనాలే పరమావధిగా ఉండే డ్రగ్ డివైజ్‌ల్లాంటి వైవిధ్యమైన రెస్పిరేటరీ ఉత్పత్తులను రూపొందించాలన్న జైడస్ యొక్క దీర్ఘకాలిక వ్యూహానికి ఇది అనుగుణంగా ఉంది.



# ఏఐతో భవిష్యత్ ఉద్యోగ నైపుణ్యాలకు కొత్త దిశ

**టీసీఎస్–పియర్‌సన్ భాగస్వామ్యం**

**ముద్ర, హైదరాబాద్:**

పియర్సన్ పీఎల్‌సీ, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) మధ్య కుదిరిన బహుళ సంవత్సరాల భాగస్వామ్యం గ్లోబల్ పరిశ్రమల్లో ఏఐ ఆధారిత అభ్యాసాన్ని వేగవంతం చేయడానికి కీలక అడుగుగా నిలుస్తోంది. ఈ భాగస్వామ్యం ద్వారా లెర్నింగ్, అసెస్‌మెంట్, క్లౌడ్ టెక్నాలజీలను సమగ్రంగా ఉపయోగించి కంపెనీలు తమ ఉద్యోగులకు అవసరమైన అవకాశాలను సిద్ధం చేసుకునే అవకాశం ఉంది. పియర్‌సన్ యొక్క లెర్నింగ్, అసెస్‌మెంట్ నైపుణ్యాన్ని టీసీఎస్ యొక్క కాంటెక్స్‌చువల్ ఏఐఐ సామర్థ్యాలతో మేళవించడం ద్వారా ఉద్యోగుల్లో నైపుణ్యం లోపాలను గుర్తించి, అవసరమైన శిక్షణను అందించవచ్చు. దీనివల్ల కంపెనీలు మారుతున్న టెక్నాలజీ వాతావరణానికి త్వరగా సరిపోయేలా తమ సిబ్బందిని అభివృద్ధి చేసుకోవచ్చు. ఈ భాగస్వామ్యంలో భాగంగా కొత్త ఏఐ ఆధారిత లెర్నింగ్ ఉత్పత్తులను అభివృద్ధి చేయడం, ఉద్యోగుల కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించడం, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లో ఆధునిక శిక్షణా విధానాలను ప్రవేశపెట్టడం వంటి అంశాలను దృష్టిలో ఉంచుతుంది. ముఖ్యంగా టీసీఎస్ ఐఓఎన్ ప్లాట్‌ఫారమ్‌లో పియర్‌సన్ సొల్యూషన్స్ సమగ్రపర్చడం ద్వారా కంపెనీలు, ప్రభుత్వాలు సమగ్ర టాలెంట్ ఎకోసిస్టమ్‌ను నిర్మించుకునే అవకాశం ఉంటుంది. మొత్తానికి, ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం సంస్థలకు ఉద్యోగుల నైపుణ్యాలను, ఉత్పాదకతను పెంచడంలో ఏఐఐ ఆధారిత ఆర్థిక వ్యవస్థలో పోటీతత్వాన్ని సాధించడంలో కీలకంగా వ్యవహరిస్తుంది.



# ఫ్రాన్స్ అధ్యక్షుడితో మోదీ ఫోన్ కాల్

- **పశ్చిమాసియా ఉద్రిక్తతలు తగ్గింపునకు చర్చ**

పశ్చిమాసియాలో ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్న వేళ.. పలు దేశాధినేతలతో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడుతున్నారు. తాజాగా ఒమన్ సుల్తాన్, మలేషియా ప్రధాని, ఫ్రాన్స్ అధ్యక్షుడితో సంభాషించారు. ఘర్షణలు తక్షణమే తగ్గించాల్సిన ఆవశ్యకతపై చర్చించారు. ఒమన్ సుల్తాన్ హైతమ్ బిన్ తారిక్‌తో మాట్లాడినట్లు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఉద్రిక్తతలు తగ్గించేందుకు అవసరమైన చర్చలకు ప్రాధాన్యం ఇచ్చామని చెప్పారు. హర్మూజ్ జలసంధి మార్గంలో నౌకలు సురక్షితంగా వెళ్లే అంశానికి ఇరుదేశాలు కట్టుబడి ఉన్నాయన్నారు. మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతోనూ ఇదే విషయమై చర్చించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు మరో పోస్టు చేశారు. "పశ్చిమాసియా ప్రాంతంలోని నెలకొన్న పరిస్థితులు, అక్కడ ఉద్రిక్తతలు తక్షణమే తగ్గించాల్సిన ఆవశ్యకతపై చర్చించాం" అని పేర్కొన్నారు. ఘర్షణలకు ముగింపు పలికేలా చర్చలు, దౌత్య మార్గాలను పునప్రారంభించాల్సి ఉందన్నారు. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం నెలకొల్పేందుకు ఇరుదేశాలు సమన్వయంతో ముందుకు సాగేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు.

# ఖతర్, సౌదీపై ఇరాన్ దాడి

- **ఎల్ఎన్‌జీ, చమురు నిక్షేపాలే లక్ష్యంగా దాడులు**
- **భారత ఇంధన భద్రతకు గండం**

**ముద్ర, డెస్క్:**



పశ్చిమాసియాలో ముదురుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్నాయి. ముఖ్యంగా ఇరాన్, దాని ప్రత్యర్థి దేశాల మధ్య జరుగుతున్న దాడులు, ప్రతిదాడులు ఇంధన మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకోవడం వల్ల పరిస్థితి క్లిష్టంగా మారుతోంది. ఖతర్‌లోని రాస్ లఫన్ ఎల్ఎన్‌జీ కేంద్రం, సౌదీ అరేబియాలోని అరామ్‌కో రిఫైనరీలపై దాడులు భారతదేశానికి హెచ్చరికగా మారాయి. భారతదేశం తన ఇంధన అవసరాలను విదేశీ దిగుమతుల ద్వారా తీర్చుకుంటోంది. ముఖ్యంగా సహజ వాయువు అవసరాలు సగం వరకు దిగుమతులపైనే ఆధారపడుతుంది. అందులో కూడా ఖతర్ నుంచి వచ్చే ఎల్ఎన్‌జీ కీలక పాత్ర పోషిస్తుంది. ఇలాంటి సమయంలో రాస్ లఫన్ కేంద్రంపై దాడి జరగడం భారత గ్యాస్ సరఫరా వ్యవస్థపై నేరుగా ప్రభావం చూపే ప్రమాదం ఉంది. సరఫరాలో అంతరాయం కలిగితే విద్యుత్ ఉత్పత్తి, ఎరువుల తయారీ, నగర గ్యాస్ పంపిణీ వంటి రంగాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటాయి. ఇక సౌదీ అరేబియాలోని అరామ్‌కో రిఫైనరీపై దాడి ప్రపంచ చమురు మార్కెట్లలో ప్రకంపనలు సృష్టించింది. సౌదీ భారత్‌కు ప్రధాన చమురు సరఫరాదారుల్లో ఒకటి. అక్కడి ఉత్పత్తిలో అంతరాయం కలిగితే అంతర్జాతీయ మార్కెట్లో ధరలు ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉంది. దాని ప్రభావం దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల రూపంలో కనిపిస్తుంది. ఇంధన ధరల పెరుగుదల ప్రభావం కేవలం ఇంధన రంగానికే పరిమితం కాదు. విద్యుత్ ఉత్పత్తి వ్యయం పెరగడం, రవాణా ఖర్చులు అధికమవడం, ఎరువుల ధరలు పెరగడం వంటి పరిణామాలు మొత్తం ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతాయి. దీని ఫలితంగా ద్రవ్యోల్బణం పెరిగి సామాన్య ప్రజలపై భారం పడుతుంది. పరిశ్రమల ఉత్పత్తి వ్యయం పెరగడం వల్ల అంతర్జాతీయ మార్కెట్లో భారత ఉత్పత్తుల పోటీ సామర్థ్యం కూడా తగ్గే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితుల్లో భారత్ ముందుచూపుతో వ్యూహాత్మక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. పశ్చిమాసియాపైనే ఆధారపడకుండా అమెరికా, ఆస్ట్రేలియా, ఆఫ్రికా దేశాల నుంచి ఎల్ఎన్‌జీ దిగుమతులను విస్తరించాలి. అత్యవసర పరిస్థితుల కోసం వ్యూహాత్మక చమురు నిల్వలను పెంచుకోవాలి. అంతేకాకుండా సౌర, వాయు విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధన వనరులపై పెట్టుబడులను వేగవంతం చేయడం ద్వారా శిలాజ ఇంధనాలపై ఆధారాన్ని తగ్గించుకోవాలి. మొత్తానికి పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఈ సంక్షోభం ప్రపంచ శాంతికే కాకుండా భారత ఆర్థిక స్థిరత్వానికి కూడా సవాల్‌గా మారింది. రాబోయే రోజుల్లో పరిస్థితులను జాగ్రత్తగా పరిశీలిస్తూ భారత్ తన ఇంధన భద్రతా వ్యూహాలను మరింత బలపరచాల్సిన అవసరం ఉంది.

# జర్నలిస్టు సంక్షేమ నిధికి రూ లక్ష విరాళం

- **ఎమ్మెల్యేగా ఉన్నంతవరకు నిధికి ప్రతీ నెల రూ.లక్ష**
- **ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**



మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన " జర్నలిస్టు సంక్షేమ నిధికి' ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి రూ. లక్ష విరాళం ఇచ్చారు. ప్రతినెలా రూ. లక్ష ఇస్తానని, తాను ఎమ్మెల్యే గా ఉన్నన్ని రోజులు ఈ విరాళం అందిస్తానన్నారు. గత నెలలో జర్నలిస్టులకు ఇచ్చిన మాట ప్రకారం ఆయన ఈ నిధులు అందించారు. ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ మంచి కార్యక్రమానికి తాను ఫండ్ ఇవ్వడం శుభపరిణామం అని ఆయన అన్నారు. గురువారం తన క్యాంపు కార్యాలయం లో జరిగిన కార్యక్రమంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా నిధిని ఏర్పాటు చేసినట్లు, అలాగే ఆ నిధికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేసినట్లు సంఘం సభ్యులు ఎమ్మెల్యే కు వివరించారు. నిధి నిర్వహణ, వినియోగ విధానం గురించి వివరంగా తెలియజేశారు. జర్నలిస్టుల ప్రతిపాదనలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే వెంటనే స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలు ప్రజాస్వామ్యానికి ఎంతో ముఖ్యమన్నారు. ముఖ్యంగా ఆపత్కాలంలో, అనారోగ్య పరిస్థితుల్లో జర్నలిస్టులకు ఆర్థికసాయం అందించేందుకు ఈ సంక్షేమ నిధి ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నిధిని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి నిజంగా అవసరమైన వారికి ఉపయోగపడేలా చూడాలని ఆయన సూచించారు. జర్నలిస్టుల ఐక్యతతో ఈ నిధి మరింత బలపడుతుందని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆయన చేస్తున్న సహాయం జర్నలిస్టులకు భరోసాను కలిగిస్తుందన్నారు. అనంతరం జర్నలిస్ట్ లు ఎమ్మెల్యే ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాలమూరు డిప్యూటీ మేయర్ మారే పల్లి సురేందర్ రెడ్డి, నాయకులు మైత్రి యాదయ్య, జర్నలిస్ట్ సంఘం అధ్యక్షులు వాకిట అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి మల్లు మధుసూదన్ రెడ్డి, సభ్యులు సతీష్ కుమార్ రెడ్డి, సంతోష్ కుమార్, పల్లెమోని యాదయ్య, రఘు, రాఘవేందర్, రవి కుమార్, తిరుపతయ్య, కేశవులు, సతీష్, శ్రీకాంత్ జర్నలిస్టులు, సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే యెన్నంకు రేవంత్ రెడ్డి గుర్తింపు

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**

మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలంగాణ లెజిస్లేటివ్ అసెంబ్లీలో ప్రభుత్వ విప్‌గా నియమిస్తూ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు అధికారిక ప్రకటన వెలువడింది. ప్రభుత్వ విప్‌గా నియమితులైన యెన్నం శ్రీనివాస్ రెడ్డి అసెంబ్లీలో ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా అమలు చేయడంలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. అసెంబ్లీ లో ప్రభుత్వానికి సంబంధించిన శాసనసభ కార్యక్రమాలు సజావుగా కొనసాగేందుకు విప్‌గా ఆయన బాధ్యతలు నిర్వర్తించనున్నారు. యెన్నం నియామకం పట్ల మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లాకు చెందిన నాయకుడికి ఇలాంటి కీలక పదవి దక్కడం గర్వకారణమని పేర్కొన్నారు. తమ రాజకీయ అనుభవం, ప్రజలతో ఉన్న అనుబంధం, సేవా దృక్పథంతో ఈ బాధ్యతలను విజయవంతంగా నిర్వహిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన పదవీకాలంలో మహబూబ్‌నగర్ జిల్లాకు మరింత అభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్‌గా ఆయన నియామకం రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామంగా అభివర్ణించారు. ఇప్పుడు ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు చేపట్టడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రజాసేవకు మరింత అవకాశాలు లభించనున్నాయి. ఈ నియామకం నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆనందోత్సాహాల్లో మునిగిపోయాయి. పలుచోట్ల నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలుపుతూ స్వీట్లు పంచుకున్నారు.



# కేరళ అసెంబ్లీ ఎన్నికలు: నామినేషన్ వేసిన ముఖ్యమంత్రి

**ముద్ర న్యూస్ :**

దేశవ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగిన విషయం తెలిసిందే. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ధర్మదం నుంచి బరిలో దిగనున్నారు. ఏప్రిల్ 9న రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. గురువారం ఆయన నామినేషన్ వేశారు.ఉదయం 11 గంటల సమయంలో తలస్సెరి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో నామినేషన్ పత్రాలను సమర్పించారు. బుధవారం తన నియోజకవర్గంలో విజయన్ రోడ్‌షో నిర్వహించారు . 80 ఏళ్ల వయసులోనూ ఉత్సాహంగా ప్రచారం మొదలుపెట్టిన విజయన్ తన రాజకీయ జీవితంలో అసెంబ్లీ ఎన్నికలకు పోటీ చేయడం ఇది ఏడోసారి. ధర్మదం నుంచి బరిలోకి దిగడం ఇది మూడోసారి. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ తరఫున వీపీ అబ్దుల్ రషీద్ బరిలో నిలవగా, భాజపా అభ్యర్థిగా రంజిత్ పోటీ చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 9న 140 అసెంబ్లీ స్థానాల్లో ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

# అస్సాంలో భాజపా తొలి జాబితా..



**సీఎం పోటీ ఇక్కడినుంచే**

**ముద్ర డెస్క్ :**

అస్సాం అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి భాజపా (BJP) తన అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసింది. మొత్తం 88 మంది అభ్యర్థుల పేర్లను పేర్కొంది. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ జాలుక్‌బారీ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. ఇది ఆయనకు కంచుకోట. 2001, 2006, 2011, 2016, 2021ల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలన్నింటిలోనూ హిమంత ఇక్కడి నుంచే విజయం సాధించారు. ఇక, కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన కీలక నేతల పేర్లు కూడా తాజా జాబితాలో ఉన్నాయి. ఇటీవల భాజపాలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విభాగం మాజీ అధ్యక్షుడు భూపేన్ కుమార్ బోరా బిహ్‌పురా నియోజకవర్గం నుంచి బరిలోకి దిగుతున్నారు. ఇక, బుధవారం కాంగ్రెస్‌ను వీడి భాజపాలో చేరిన ప్రద్యుత్ బోర్డోలోయ్ దిస్పూర్ నుంచి ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. కాగా.. 126 అసెంబ్లీ స్థానాలు ఉన్న అస్సాంలో ఏప్రిల్ 9న పోలింగ్ జరగనుంది. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.


ఉద్యోగాల కోసం
సమయపాలన పాటించండి
ఇంటర్వ్యూలకు టైమ్‌కు హాజరుకండి.
పంక్చువాలిటీ మీపై మంచి ఇంప్రెషన్ ఇస్తుంది.




## సన్‌రైజర్స్ హైదరాబాద్ తుది జట్టు!?

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అంచనా తుది జట్టు ఇలా ఉండే అవకాశం ఉంది. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ ఓపెనర్లుగా బరిలోకి దిగనున్నారు. కెప్టెన్ ఇషాన్ కిషన్, హెన్రీచ్ క్లాసెన్, నితీష్ కుమార్ రెడ్డి మిడిలార్డర్‌లో కీలక పాత్ర పోషించనున్నారు. లియామ్ లివింగ్‌స్టోన్, అనికేత్ వర్మ ఫినిషర్లుగా కనిపించనున్నారు. బౌలింగ్ విభాగంలో బ్రైడన్ కార్స్, హర్షల్ పటేల్ ఆల్‌రౌండర్లుగా ఉండగా, జయదేవ్ ఉనాద్కత్ లేదా ప్రఫుల్ హింగే పేస్ బాధ్యతలు చేపట్టే అవకాశముంది. స్పిన్ విభాగంలో జీషన్ అన్సారీ లేదా క్రెయిన్స్ ఫులెట్రా చోటు దక్కించుకునే అవకాశముంది.

**అంచనా ప్లేయింగ్ ఎలెవన్:**
ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ (కెప్టెన్), హెన్రీచ్ క్లాసెన్ (కీపర్), లియామ్ లివింగ్‌స్టోన్, నితీష్ కుమార్ రెడ్డి, అనికేత్ వర్మ, బ్రైడన్ కార్స్, హర్షల్ పటేల్, జయదేవ్ ఉనాద్కత్/ప్రఫుల్ హింగే, జీషన్ అన్సారీ/క్రెయిన్స్ ఫులెట్రా
ఇంపాక్ట్ ప్లేయర్: అనికేత్ వర్మ / సలీల్ అరోరా

## ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన గంభీర్

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తన వ్యక్తిత్వ హక్కుల పరిరక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాడు. తన అనుమతి లేకుండా పేరు, ముఖం, గొంతును వాణిజ్య ప్రయోజనాలు, తప్పుడు ప్రచారం కోసం వాడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సివిల్ దావా వేశాడు. ఈ కేసులో సోషల్ మీడియా అకౌంట్లు, ఈకామర్స్ సైట్లు, అంతర్జాతీయ టెక్ కంపెనీలు సహా 16 మందిని ప్రతివాదులుగా చేర్చాడు. ఇటీవలి కాలంలో గంభీర్ పేరుతో డీప్ ఫేక్ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆయన చెప్పని మాటలను చెప్పినట్లుగా చూపిస్తూ తప్పుడు వీడియోలు సృష్టించడం వల్ల ప్రజల్లో గందరగోళం ఏర్పడుతోందని గంభీర్ ఆందోళన వ్యక్తం చేశాడు. ఇవి తన వృత్తిపరమైన ప్రతిష్టకు కూడా నష్టం కలిగిస్తున్నాయని తెలిపాడు. అలాగే తన ఫోటోలతో అనుమతి లేకుండా ఉత్పత్తులు విక్రయిస్తున్న ఈకామర్స్ వేదికలపై కూడా గంభీర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ నేపథ్యంలో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మెటా, ఎక్స్, గూగుల్, యూట్యూబ్ వంటి సంస్థలను కేసులో భాగం చేశాడు. తన గుర్తింపును దుర్వినియోగం చేసినందుకు రూ.2.5 కోట్ల నష్టపరిహారం ఇవ్వాలని, సోషల్ మీడియాలో ఉన్న నకిలీ వీడియోలు, పోస్టులను వెంటనే తొలగించాలని గంభీర్ కోర్టును కోరాడు. భవిష్యత్తులో తన పేరు, ముఖం, గొంతును తప్పుడు ప్రచారానికి వాడకుండా శాశ్వత నిషేధం విధించాలని అభ్యర్థించాడు. ఇది కేవలం వ్యక్తిగత విషయం కాదని, వ్యక్తిగత గౌరవం, చట్టానికి సంబంధించిన అంశమని గంభీర్ పేర్కొన్నాడు. ప్రస్తుతం ఈ కేసు ఢిల్లీ హైకోర్టులో విచారణలో ఉంది.





## ధోనీ వందేళ్లకు ఒకసారి పుడతాడు: సురేష్ రైనా

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

చెన్నై సూపర్ కింగ్స్ మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీపై మాజీ క్రికెటర్ సురేష్ రైనా ప్రశంసలు కురిపించాడు. ధోనీ వందేళ్లకు ఒకసారి పుట్టే ఆటగాడని, భారత క్రికెట్ దిశను మార్చిన నాయకుడని పేర్కొన్నాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో ధోనీ పాత్రపై స్పందించిన రైనా, జట్టులో యువ ఆటగాళ్లకు మార్గదర్శకుడిగా అతని ఉనికి ఎంతో కీలకమని తెలిపాడు. మైదానంలో ధోనీ ఉండటం జట్టుకు పెద్ద బలమని అభిప్రాయపడ్డాడు. ధోనీ కెప్టెన్సీలోనే విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి ఆటగాళ్లు ఎదిగారని రైనా చెప్పాడు. తాను కూడా ధోనీ మార్గదర్శకత్వంలోనే ఎదిగానని వెల్లడించాడు. సీఎస్‌కేలో ధోనీ కేవలం వికెట్ కీపర్, బ్యాటర్ మాత్రమే కాకుండా జట్టుకు పెద్ద దిక్కుగా వ్యవహరిస్తాడని రైనా తెలిపాడు. యువ ఆటగాళ్లను గైడ్ చేయడంలో అతని పాత్ర ఎంతో ముఖ్యమని చెప్పాడు. ఐపీఎల్ 2026లో ధోనీ ఆడే మ్యాచ్‌ల సంఖ్య అతని ఫిట్‌నెస్‌పై ఆధారపడి ఉంటుందని రైనా పేర్కొన్నాడు.



## నా కెప్టెన్సీకి గంభీర్ కారణం కాదు: సూర్యకుమార్ యాదవ్

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**


టీమిండియా టీ20 కెప్టెన్‌గా తన ఎంపిక వెనుక గౌతమ్ గంభీర్ లేడని సూర్యకుమార్ యాదవ్ స్పష్టం చేశాడు. తనను సారథిగా ఎంపిక చేసినది ఇతర కీలక వ్యక్తులేనని వెల్లడించాడు. తాజా ఇంటర్వ్యూలో మాట్లాడిన సూర్య, తన కెప్టెన్సీ నిర్ణయం రోహిత్ శర్మ, అజిత్ అగార్కర్, రాహుల్ ద్రవిడ్, జై షా కలిసి తీసుకున్నారని తెలిపాడు. గంభీర్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టకముందే ఈ నిర్ణయం జరిగిందని వివరించాడు. శ్రీలంక సిరీస్‌కు కొన్ని రోజుల ముందు జై షా ఫోన్ చేసి కెప్టెన్సీ విషయాన్ని తనకు తెలియజేశారని సూర్య చెప్పాడు. అప్పటికే ఎంపిక ప్రక్రియ పూర్తయిందని, ఆ తర్వాతే గంభీర్ జట్టులో చేరాడని స్పష్టం చేశాడు.

## దూబే ట్రైన్ ప్రయాణంపై హైప్ ఎందుకు?: అశ్విన్ అసహనం

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**



టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ క్రికెటర్లకు సంబంధించిన చిన్న విషయాలను సెన్సేషన్ చేయడంపై అసహనం వ్యక్తం చేశాడు. క్రికెటర్లు కూడా సాధారణ మనుషులేనని మీడియా, నెటిజన్లకు చురకలించాడు. టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్ అనంతరం శివమ్ దూబే రైల్లో ప్రయాణించడం పెద్ద చర్చగా మారింది. అహ్మదాబాద్ నుంచి ముంబైకి విమాన టికెట్లు లభించకపోవడంతో అతను రాత్రివేళ రైలులో ప్రయాణించాడు. గుర్తు పట్టకుండా మాస్క్, క్యాప్ ధరించి సాధారణ ప్రయాణికుడిలా వెళ్లాడు.
ఈ ఘటనపై స్పందించిన అశ్విన్, ఒక క్రికెటర్ రైలులో ప్రయాణించడంలో ప్రత్యేకత ఏమీ లేదని వ్యాఖ్యానించాడు. తాను కూడా ఎన్నోసార్లు రైల్లో ప్రయాణించానని గుర్తు చేశాడు. ఇలాంటి సాధారణ విషయాలను అతిశయోక్తిగా చూపించడం అవసరం లేదని అశ్విన్ పేర్కొన్నాడు. క్రికెటర్లు కూడా సాధారణ జీవితాన్ని ఆస్వాదిస్తారని, అలాంటి విషయాలను సెన్సేషన్ చేయడం సరైంది కాదని అభిప్రాయపడ్డాడు.



## ఇంగ్లాండ్ క్రికెట్‌కు డ్యూక్ బంతుల కొరత

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతల ప్రభావం ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డుకు కొత్త సమస్యలను తెచ్చిపెడుతోంది. గల్ఫ్ ప్రాంతంలో రవాణా మార్గాలు దెబ్బతినడంతో డ్యూక్ బంతుల సరఫరా యూకేకు కష్టంగా మారింది. ఉపఖండం నుంచి సరఫరా ఆలస్యం అవుతుండగా, విమాన రవాణా ఖర్చులు మూడింతలు పెరిగాయి. దీంతో ప్రస్తుతం అవసరానికి సగం మాత్రమే బంతులు అందుబాటులో ఉన్నట్లు ఈసీబీ వర్గాలు తెలిపాయి. ఈ పరిస్థితి కొనసాగితే రాబోయే మ్యాచ్‌ల సన్నద్ధతపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఏప్రిల్ 3 నుంచి ఇంగ్లాండ్ కొత్త సీజన్ ప్రారంభం కానుండగా, కౌంటీ ఛాంపియన్‌షిప్, టెస్టు మ్యాచ్‌లకు ఈ బంతులే కీలకం. తయారీ సంస్థ బ్రిటిష్ క్రికెట్ బాల్స్ లిమిటెడ్ కూడా సరఫరా సమస్యను ధృవీకరించింది. ఫ్యాక్టరీల్లో బంతులు సిద్ధంగా ఉన్నప్పటికీ రవాణా ఇబ్బందులు ప్రధాన అడ్డంకిగా మారాయని తెలిపింది. ఇక ఐపీఎల్‌పై మాత్రం ఈ ప్రభావం కనిపించదని సమాచారం. కూకబుర్రా కంపెనీ తయారు చేసే తెల్ల బంతులు ఇప్పటికే భారత్‌కు చేరడంతో ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలుస్తోంది.



## కేకేఆర్‌కు వరుస షాక్‌లు.. పతిరణపై సస్పెన్స్

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందే కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుకు ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. దౌత్య ఉద్రిక్తతల నేపథ్యంలో బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రహమాన్‌ను జట్టు నుంచి తప్పించింది. ఇక టీమిండియా పేసర్ హర్షిత్ రాణా గాయం కారణంగా ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు శ్రీలంక బౌలర్ మతీశ పతిరణ గాయంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. పతిరణ ఫిట్‌గా ఉన్నప్పటికీ అతడికి శ్రీలంక క్రికెట్ బోర్డు నుంచి NOC ఇవ్వడంలో ఆలస్యం జరుగుతోందని సమాచారం. అతడి ఫిట్‌నెస్‌పై పూర్తి స్పష్టత వచ్చిన తర్వాతే అనుమతి ఇవ్వాలని బోర్డు భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో అతడు జట్టులో చేరే విషయంపై అనిశ్చితి నెలకొంది. పతిరణ కోసం తరచుగా విమాన టికెట్లు బుక్ చేసి రద్దు చేస్తున్న పరిస్థితి ఉందని జట్టు వర్గాలు తెలిపాయి. మరోవైపు అతడి మేనేజర్ మాత్రం త్వరలోనే అందుబాటులోకి వస్తాడని సంకేతాలు ఇస్తున్నాడు.ఇప్పటికే ముస్తాఫిజుర్ స్థానంలో జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్ ముజర్‌బానీని జట్టులోకి తీసుకుంది. హర్షిత్ రాణా గైర్హాజరీ, పతిరణ అనిశ్చితితో కేకేఆర్ పేస్ విభాగం ఇబ్బందుల్లో పడింది.

## ఇంపాక్ట్ ప్లేయర్‌గా ధోనీనా?: మహమ్మద్ కైఫ్ సందేహం

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026 సీజన్‌లో మహేంద్ర సింగ్ ధోనీని ఇంపాక్ట్ ప్లేయర్‌గా వాడడంపై మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ సందేహం వ్యక్తం చేశాడు. ధోనీని కేవలం బ్యాటింగ్‌కే పరిమితం చేయడం జట్టుకు ప్రయోజనం ఇవ్వదని అభిప్రాయపడ్డాడు. ధోనీ వికెట్ కీపర్‌గా కొనసాగితేనే జట్టుకు ఎక్కువ లాభం ఉంటుందని తెలిపాడు. వికెట్ల వెనుక ఉండి బౌలర్లను గైడ్ చేయడం, ఫీల్డింగ్ సెట్ చేయడం వంటి అంశాల్లో అతని అనుభవం కీలకమని పేర్కొన్నాడు. గతంలా వేగంగా పరుగులు చేయడం ఇప్పుడు కష్టమని, అందుకే ఇంపాక్ట్ ప్లేయర్ పాత్రకు పరిమితం చేయడం సరికాదని కైఫ్ స్పష్టం చేశాడు.



## ఢిల్లీకి ఐరిష్ టచ్.. ఫీల్డింగ్ కోచ్‌గా జాన్ మూనీ





**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు ఢిల్లీ క్యాపిటల్స్ తమ కోచింగ్ సిబ్బందిని బలోపేతం చేస్తోంది. ఫీల్డింగ్ విభాగాన్ని మెరుగుపరచేందుకు ఐర్లాండ్ మాజీ ఆల్‌రౌండర్ జాన్ మూనీని ఫీల్డింగ్ కోచ్‌గా నియమించింది. ఈ విషయాన్ని ఢిల్లీ ఫ్రాంచైజీ అధికారికంగా ప్రకటించింది. జట్టులో ఫీల్డింగ్ నైపుణ్యాలను పెంచే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. 44 ఏళ్ల జాన్ మూనీకి కోచింగ్‌లో మంచి అనుభవం ఉంది. ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు నుంచి లెవల్ 1, 2, 3 కోచింగ్ కోర్సులు పూర్తి చేసిన ఆయన, అఫ్గనిస్థాన్, వెస్టిండీస్ జట్లకు ఫీల్డింగ్ కోచ్‌గా పనిచేశాడు. ఐర్లాండ్ మహిళల జట్టుకు కూడా సేవలందించాడు. ఇప్పటి వరకు ఫీల్డింగ్ కోచ్‌లుగా ఉన్న ఆంటోన్ రౌక్స్, జ్ఞానేశ్వర రావుల స్థానంలో మూనీ బాధ్యతలు చేపట్టనున్నాడు. హెడ్ కోచ్ హేమంగ్ బదాని, బౌలింగ్ కోచ్ మునాఫ్ పటేల్, అసిస్టెంట్ కోచ్‌లు ఇయాన్ బెల్, వేణుగోపాల్ రావుతో కలిసి పనిచేయనున్నాడు. గత సీజన్‌లో ఆశించిన ఫలితాలు సాధించలేకపోయిన ఢిల్లీ క్యాపిటల్స్ ఈసారి మెరుగైన ప్రదర్శన చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
20.03.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



ఉద్యోగాల కోసం ఓర్పు మరియు పట్టుదల కలిగి ఉండండి
మొదటి ప్రయత్నంలో ఉద్యోగం రాకపోవచ్చు. కానీ కష్టపడితే తప్పకుండా మంచి అవకాశం దొరుకుతుంది
BE POSITIVE ★ PATIENT ★




## బర్త్ డే రోజున 'కలెక్షన్ కింగ్'కు బిగ్ సర్‌ప్రైజ్

**దిప్యారడైజ్ నుంచి స్పెషల్ అప్‌డేట్**

ముద్ర, సినిమా డెస్క్:

టాలీవుడ్ లెజెండరీ నటుడు, 'కలెక్షన్ కింగ్' మంచు మోహన్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన నటిస్తున్న తాజా చిత్రం ది ప్యారడైజ్ నుంచి కీలక అప్‌డేట్ వచ్చింది. చిత్ర బృందం ప్రత్యేక వీడియోను విడుదల చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపింది. నేచురల్ స్టార్ నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ఈ పాన్ ఇండియా సినిమా రూపొందుతోంది. ఇందులో మోహన్ బాబు పవర్‌ఫుల్ విలన్ పాత్రలో కనిపించబోతున్నారు. 'శికంజా మాలిక్' అనే డార్క్ క్యారెక్టర్‌లో ఆయన నటిస్తున్నట్టు వీడియో ద్వారా వెల్లడించారు. పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఈ వీడియోతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. కొత్త తరం ప్రేక్షకులకు మోహన్ బాబు నటన ఎలా ఉంటుందో ఈ సినిమాతో చూపిస్తామని దర్శకుడు శ్రీకాంత్ ఓదెల చెప్పడం విశేషం. ది ప్యారడైజ్ ఆగస్టు 21, 2026న ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో విడుదల కానుంది.

## 'పెద్ది' సెట్‌లో తిలక్ వర్మ సందడి: రామ్‌చరణ్ ఇచ్చిన స్పెషల్ బ్యాట్

క్రికెట్ నేపథ్యంలో రూపొందుతున్న పెద్ది సినిమా ప్రచార చిత్రంలో హీరో కొట్టిన షాట్ చూసి క్రికెట్ అభిమానులు ఫిదా అయ్యారు. ముఖ్యంగా సినిమాలో ఉపయోగించిన బ్యాట్ కూడా అందరి దృష్టిని ఆకర్షించింది. తాజాగా అదే బ్యాట్‌ని చూసి భారత క్రికెటర్ తిలక్ వర్మ మురిసిపోయారు. ఇటీవల టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో సభ్యుడైన తిలక్ వర్మ 'పెద్ది' సినిమా సెట్స్‌ను సందర్శించారు. చిత్రీకరణ జరుగుతున్న సమయంలో ఆయన సెట్లోకి రావడంతో చిత్రబృందం ఘనంగా స్వాగతం పలికింది. హీరో రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానాతో పాటు ఇతర సభ్యులతో తిలక్ వర్మ ప్రత్యేకంగా ముచ్చటించారు. సెట్ మొత్తం తిరిగి చూసిన ఆయనకు సినిమాలో ఉపయోగించిన బ్యాట్ ఎంతో నచ్చింది. దీంతో హీరో రామ్ చరణ్ స్వయంగా ఆ 'పెద్ది' బ్యాట్‌ను తిలక్ వర్మకు బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా తిలక్ వర్మ కూడా చిత్రబృందానికి అభినందనలు తెలిపారు. క్రీడా నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాలో రామ్ చరణ్కి జంటగా జాన్వీ కపూర్ నటిస్తున్నారు. పెద్ది ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది.






## ''ఉస్తాద్,' అనిపించుకోని పవన్

పవన్ కళ్యాణ్-హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఉస్తాద్ భగత్ సింగ్' పూర్తి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కింది. కథ రొటీన్ అయినప్పటికీ పవన్ కళ్యాణ్ మేనియా సినిమాను నడిపించింది.

*కథ సారాంశం:* అనాథ అయిన చిన్నయ్యకు 'భగత్ సింగ్'గా పేరు పెట్టి ఉపాధ్యాయుడు మార్గదర్శనం చేస్తాడు. ఆ ఉపాధ్యాయుడు సీఎం అవుతాడు. అతడిని చంపి అధికారం దక్కించుకోవాలని చూసే నల్ల నాగప్ప నుంచి సీఎం ను భగత్ సింగ్ ఎలా కాపాడాడనేది కథ.

*విశ్లేషణ:* ఫస్టాఫ్ పెద్దగా ఆకట్టుకోదు. కానీ సెకండాఫ్‌లో శ్రీలీల ఎపిసోడ్‌తో సినిమా ఊపు అందుకుంటుంది. ఎమోషనల్ సన్నివేశాలు, క్లైమాక్స్ బాగా వర్కౌట్ అయ్యాయి. కథ ముందే ఊహించదగినదే అయినా పవన్ స్క్రీన్ ప్రెజెన్స్ మెయిన్ హైలైట్.

*పర్ఫామెన్స్:* పవన్ కళ్యాణ్ తన స్టైల్‌తో మెప్పించాడు. శ్రీలీల ఎపిసోడ్స్ ప్లస్ అయ్యాయి. రాశి ఖన్నా ఓకే. విలన్‌గా పార్తీబన్ సెటిల్డ్‌గా నటించాడు.

*టెక్నికల్:* దేవి శ్రీ ప్రసాద్ సంగీతం, తమన్ బ్యాగ్రౌండ్ స్కోర్ బాగున్నాయి. ప్రొడక్షన్ వాల్యూస్ మంచి స్థాయిలో ఉన్నాయి.

*ప్లస్ పాయింట్స్:* పవన్ కళ్యాణ్, సెకండాఫ్, శ్రీలీల *మైనస్ పాయింట్స్:* ఫస్టాఫ్, రొటీన్ కథ, కామెడీ

*తీర్పు:* పవన్ అభిమానులకు నచ్చే మాస్ ఎంటర్‌టైనర్. సాధారణ ప్రేక్షకులకు మాత్రం ఓకే అనిపించే సినిమా.

***రేటింగ్: 2.5/5***

-అజయ్, ముద్ర

## స్టైలిష్ లుక్‌లో సారా అర్జున్ – బ్లాక్ డ్రెస్‌లో దురంధర్ బ్యూటీ



**రంధర్ ది రివెంజ్ పార్ట్ 3పై వీడిన సస్పెన్స్**

బాక్సాఫీస్ వద్ద దుమ్మురేపుతున్న దురంధర్ ది రివెంజ్ సినిమాపై ప్రేక్షకుల్లో ఒక కీలక ప్రశ్న మొదటి రోజు నుంచే వినిపిస్తోంది. అదే ఈ కథకు మూడో భాగం వస్తుందా లేదా అన్నది. ముఖ్యంగా దర్శకుడు ఆదిత్య ధార్ విడుదలకు ముందు సోషల్ మీడియాలో చేసిన ఒక పోస్టుతో ఆ అనుమానాలు మరింత పెరిగాయి. ఎండ్ టైటిల్స్ పూర్తయ్యే వరకు వెళ్లిపోవద్దని, చిన్న సస్పెన్స్ ఉంటుందని ఆయన చెప్పడంతో అభిమానులు పార్ట్ 3కి క్లూ ఇస్తారేమో అని ఆశించారు. అయితే ప్రీమియర్లతోనే ఆ సస్పెన్స్ క్లియర్ అయిపోయింది. సినిమాలో ఎలాంటి కొత్త ట్విస్టు లేకుండా కథను పూర్తిగా ముగించారు. హంజా పాకిస్థాన్‌లో ఉన్న శత్రువులను అంతం చేసి తిరిగి రావడంతో కథ ముగుస్తుంది. మూడో భాగానికి బలవంతంగా లీడ్ ఇవ్వడం లాంటి ప్రయత్నం కూడా చేయలేదు. అందుకే ఈ సిరీస్ ఇక్కడితో ముగిసినట్టే అనే అభిప్రాయం ప్రేక్షకుల్లో బలపడుతోంది. సినిమాలో ఆర్. మాధవన్ పాత్రకు కొత్త మిషన్ వచ్చినా అతను ప్రతిసారి హంజాపైనే ఆధారపడే పరిస్థితి ఉండదనే భావనను కూడా కథ స్పష్టంగా చెబుతుంది. ఆ కోణంలో చూస్తే ఆదిత్య ధార్ తదుపరి సినిమా పూర్తిగా వేరే జానర్‌లో ఉండే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. భారీ ఫ్రాంచైజీలా కొనసాగించకుండా కథను ఇక్కడితో ముగించడం ప్రత్యేకంగా కనిపిస్తోంది. ఇక బాక్సాఫీస్ విషయానికి వస్తే దురంధర్ ది రివెంజ్ అసలు తగ్గేలా కనిపించడం లేదు. బుక్ మై షోలో గంటకు లక్షకు పైగా టికెట్లు బుక్ అవుతున్నాయన్న సమాచారం ట్రేడ్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అదే సమయంలో పుష్ప 2: ది రూల్ రికార్డులను కూడా ఈ సినిమా దాటేసిందని అభిమానులు చెప్పుకుంటున్నారు. ముంబై వంటి నగరాల్లో 24 గంటల షోలు వేస్తున్నారన్న వార్తలు కూడా వినిపిస్తున్నాయి. మిడ్‌నైట్ షోలు కూడా హౌస్‌ఫుల్ అవుతున్నాయని తెలుస్తోంది. దాదాపు నాలుగు గంటల నిడివి ఉన్నప్పటికీ ప్రేక్షకులు ఆసక్తిగా చూస్తున్నారన్న మాట వినిపిస్తోంది. మధ్యలో కొన్ని ల్యాగ్‌లు ఉన్నాయని చెప్పినా, ఓవరాల్‌గా మాత్రం ప్రేక్షకులు సంతృప్తిగా థియేటర్ల నుంచి బయటకు వస్తున్నారని ట్రేడ్ టాక్. స్పై సినిమాలకు కొత్త ట్రెండ్‌ను సెట్ చేసిన సినిమాగా కూడా దురంధర్ ది రివెంజ్ గురించి మాట్లాడుకుంటున్నారు. మొత్తంగా చూస్తే 'దురంధర్' -దురంధర్ ది రివెంజ్ రెండు భాగాలు కలిపి దాదాపు ఏడు గంటలకు పైగా కంటెంట్‌తో ప్రేక్షకులను కట్టిపడేయడం దర్శకుడు ఆదిత్య ధార్ స్టైల్‌కి నిదర్శనం అని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే తెలుగుతో పాటు ఇతర భాషల డబ్బింగ్ వెర్షన్లు ఒకేసారి విడుదలై ఉంటే ఈ సినిమాకు మరింత పెద్ద స్థాయి ఓపెనింగ్స్ వచ్చేవని కూడా అభిప్రాయం వ్యక్తమవుతోంది.



### బీచ్‌లో స్టన్నింగ్ లుక్‌లో శ్రేయా ధన్వంతరి

ముద్ర, సినిమా డెస్క్:

బాలీవుడ్ బ్యూటీ శ్రేయ ధన్వంతరి తాజాగా షేర్ చేసిన బీచ్ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. బీచ్ హాలిడే ఎంజాయ్ చేస్తూ ఆమె ఇచ్చిన స్టైలిష్ పోజులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ఫోటోల్లో శ్రేయ బ్రౌన్ కలర్ బికినీలో చాలా గ్లామరస్‌గా కనిపించారు. సాండీ బీచ్‌పై వాక్ చేస్తూ తన ఫిట్‌నెస్‌ను కూడా చూపించారు. టోన్డ్ అబ్స్, ఫిట్ బాడీ ఈ లుక్‌కు స్పెషల్ హైలైట్‌గా నిలిచాయి. ఓపెన్ హెయిర్‌తో చాలా నేచురల్‌గా కనిపించగా, ఆరెంజ్ లిప్‌స్టిక్ ఆమె లుక్‌కు బోల్డ్ టచ్ ఇచ్చింది. బీచ్ బ్యాక్‌గ్రౌండ్‌లో సన్‌లైట్, గ్రీనరీ మధ్య శ్రేయ ఇచ్చిన పోజులు ఫోటోషూట్‌ను మరింత అందంగా మార్చాయి. సింపుల్‌గా, కాన్ఫిడెంట్‌గా ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్స్ ఈ ఫోటో ఫీచర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మొత్తంగా చెప్పాలంటే శ్రేయ ధన్వంతరి బీచ్‌లో చేసిన ఈ ఫోటోషూట్‌తో మరోసారి గ్లామర్ లుక్‌లో అభిమానులను ఆకట్టుకున్నారు.

### బాపు బొమ్మగా సమంత



స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు తాజాగా బాపు బొమ్మ స్టైల్‌లో చేసిన ఫోటోషూట్‌తో అభిమానులను ఆకట్టుకున్నారు. సింపుల్‌గా, క్లాసిక్‌గా కనిపించే ఈ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పసుపు రంగు చీరకు డార్క్ గ్రీన్ బ్లౌజ్‌ను జత చేసి సమంత చాలా ఎలిగెంట్‌గా కనిపించారు. మినిమల్ జ్యువెలరీ, సాఫ్ట్ మేకప్, సింపుల్ హెయిర్ స్టైల్‌తో ఆమె అందం మరింత హైలైట్ అయింది. కెమెరా ముందు ఇచ్చిన కామ్ ఎక్స్‌ప్రెషన్స్ ఈ ఫోటోషూట్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మొత్తంగా బాపు బొమ్మ లుక్‌లో కనిపించిన సమంత రూత్ ప్రభు మరోసారి తన క్లాసిక్ అందంతో అభిమానులను మెప్పించారు.

## మూవీ రివ్యూ : పాకిస్తాన్ పని పట్టిన 'దురంధరుడు'




**రివ్యూ: దురంధర్: ది రివెంజ్**
**నటీనటులు: రణ్‌వీర్ సింగ్, సంజయ్ దత్, ఆర్. మాధవన్, అర్జున్ రాంపాల్, అక్షయ్ ఖన్నా, సారా అర్జున్, రాకేశ్ బేడీ, గౌరవ్ గేరా తదితరులు.**
**సంగీతం: శాస్వత్ సచ్‌దేవ్**
**ఛాయాగ్రహణం: వికాస్ నౌలాఖ**
**ఎడిటర్: శివకుమార్ వి. పానికర్**
**దర్శకత్వం: ఆదిత్య ధర్**
**నిర్మాతలు: ఆదిత్య ధర్, జ్యోతి దేశ్‌పాండే, లోకేష్ ధర్**

హిందీ సినిమాల్లో సరైన కంటెంట్ లేదు, సౌత్ సినిమాలు బాలీవుడ్ ను దున్నేస్తున్నాయి ఇక బాలీవుడ్ పనైపోయింది అనే కామెంట్లు జోరుగా వినిపిస్తున్న టైమ్ లో పెద్దగా అంచనాలు లేకుండా రిలీజ్ అయింది దురంధర్. కానీ రిలీజైన తర్వాత మౌత్ టాక్ తో రోజురోజుకీ కలెక్షన్లు పెంచుకుని బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించింది. సినిమాలో కంటెంట్ తో పాటుగా అక్షయ్ ఖన్నా వైరల్ డ్యాన్స్ సీక్వెన్స్ కూడా సోషల్ మీడియాలో ఈ సినిమాకు సూపర్ క్రేజ్ తీసుకొచ్చింది. ఒక్క హిందీ వెర్షన్ మాత్రమే దాదాపు వెయ్యికోట్లు వసూలు చేసిందంటే దురంధర్ సత్తాను ఎవరైనా మెచ్చుకోకుండా ఉండలేరు. మరోవైపు ఈ సినిమాను "మతవిద్వేషాలు రెచ్చగొట్టే ప్రాపగాండా సినిమా" అంటూ జోరుగా విమర్శలు కూడా వచ్చాయి. అవన్నీ పక్కన పెడితే ఈ సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న 'ధురంధర్: ది రివెంజ్' పై భారీ అంచనాలు నెలకొన్నాయి. మొదటి భాగం తరహాలోనే ఇది కూడా ఇంటెన్స్ గా ఉంటూ ప్రేక్షకులను మెప్పించిందా లేదా అనేది రివ్యూలో చూద్దాం.

మొదటి భాగంలో పాకిస్తాన్‌లోని ల్యారీ టౌన్ ఏరియాలోకి అండర్ కవర్ ఏజెంట్‌గా ప్రవేశిస్తాడు హంజా అలీ మజారీ(రణవీర్ సింగ్). ఆఫ్ఘనిస్తాన్ నుంచి వలస వచ్చిన బలోచ్ తెగవాడిగా చెప్పుకుని అతను అక్కడ ఎలా స్థిరపడ్డాడు? కరాచీ అండర్ వరల్డ్ డాన్ రెహ్మాన్ డకైత్ (అక్షయ్ ఖన్నా) గ్యాంగ్ లో చేరి చివరికి అతన్నే ఎలా తుదముట్టించాడు? ఇండియాపై పాకిస్తాన్ వారి కుట్రలకు సంబంధించిన సమాచారాన్ని భారతదేశానికి ఎలా చేరవేశాడు అనేది మొదటిభాగంలో చూపించారు. ఇప్పుడు రెండవ భాగం దురంధర్: ది రివెంజ్ లో అసలు జస్కిరత్ సింగ్ రంగి ఎవరు? అతను హంజా అలీ మజారీగా ఎందుకు మారాడు అనేది చూపించారు. ఇక రెహ్మాన్ డకైత్ మరణం తర్వాత కరాచీలోని ల్యారీ టౌన్ పగ్గాలు ఎలా చేపట్టాడు? రెహ్మాన్ డకైత్ స్థానాన్ని భర్తీ చేయడమే కాకుండా ఐయస్ఐ కుట్రలను తెలుసుకుంటూ ఎలా భారతదేశాన్ని అప్రమత్తం చేస్తూ ఉంటాడు. హంజా కేవలం గ్యాంగ్ స్టర్ గా ఎదగడమే కాకుండా, 26/11 దాడుల వెనుక ఉన్న అసలు సూత్రధారులను ఏరిపారేయడమే తన అంతిమ లక్ష్యంగా పెట్టుకుంటాడు. ఈ క్రమంలో అతనికి ఎస్పీ చౌదరి అస్లాం (సంజయ్ దత్) నుండి ఎదురైన సవాళ్లు ఏంటి? మేజర్ ఇక్బాల్ (అర్జున్ రాంపాల్) తో సాగిన మైండ్ గేమ్ ఏంటి? చివరికి తను అనుకున్నది సాధించాడా అనేది మిగతా కథ. దర్శకుడు ఆదిత్య ధర్ ఈ సీక్వెల్‌ను మొదటి భాగం తరహాలోనే ఇంటెన్స్‌గా రాగా తీర్చిదిద్దారు. చాప్టర్ వైజ్ ఒక్కో ఎపిసోడ్ ను ఓపెన్ చేసుకుంటూ వెళ్లడంతో సినిమా నిడివి 3 గంటల 49 నిమిషాలు అనే విషయం మనకు ఇబ్బందిగా అనిపించదు. రెండు భాగాలు అనగానే ఫిల్మ్ మేకర్స్ కు ఎదురయ్యే ఛాలెంజ్ అంచనాలను అందుకోవడం. ఆ విషయం దృష్టిలో ఉంచుకునే డైరెక్టర్ వర్క్ చేశాడేమో కానీ చాలా సీక్వెన్సులు హై ఇంటెన్సిటీతో సాగుతాయి. హంజా అలీ మజారీ ఫ్లాష్ బ్యాక్ గూస్ బంప్స్ తెప్పిస్తుంది. ఇక సీన్ కరాచీకి షిఫ్ట్ అయిన తర్వాత తన లక్ష్యానికి తగ్గట్టు శత్రువులను ఒక్కొక్కరుగా నిర్వీర్యం చేయడం, ఒక దశ దాటిన తర్వాత మట్టుబెట్టడం యాక్షన్ ను పతాకస్థాయికి తీసుకెళ్తాయి. ఇంత జరుగుతూ ఉన్నప్పటికీ ఎక్కడా సస్పెన్స్ ఫ్యాక్టర్ మాత్రం మిస్ కాలేదు. ముఖ్యంగా ప్రేక్షకులకు ఏదో ఒక మూల మన హీరో పట్టుబడతాడేమో ఆనే అనుమానం తొలుస్తూనే ఉంటుంది. పైగా అక్కడే పెళ్లి చేసుకుని కాపురం కూడా పెట్టాడు కాబట్టి వాళ్ళకు కూడా డేంజర్ కదా అనేది ప్రేక్షకుల్లో అనిపిస్తుంది. కానీ అవన్నీ బ్యాలెన్స్ చేసుకుంటూనే తన మిషన్ లో ముందుకు సాగడం, ఈ ప్రాసెస్ లో కొందరు ఇండియాకు వాంటెడ్ అయిన వారిని అంతం చేయడం హైలైట్ గా నిలుస్తుంది. మొదటి భాగంలో రియల్ ఇన్సిడెంట్స్ అయిన 26/11 ఉగ్రవాద దాడి లాంటి సంఘటనలను కథలో మిక్స్ చేసినట్టే ఈ భాగంలో కూడా డీమానెటైజేషన్ ను ఎందుకు చేయాల్సి వచ్చింది ఆనే కోణం చర్చించడం ఒక హైలైట్ గా నిలుస్తుంది. మొదటి భాగంలో అసంపూర్తిగా మిగిలిన చాలా అంశాలకు చక్కటి ముగింపు ఇచ్చారు. ఈ సినిమాకు శాస్వత్ సచ్ దేవ్ అందించిన నేపథ్య సంగీతం వెన్నెముకగా నిలిచింది. చాలా సీన్స్ ను సంగీతం నెక్స్ట్ లెవెల్ కు తీసుకెళ్లింది. వికాస్ సినిమాటోగ్రఫీ కూడా సినిమాకు తగ్గట్టు ఇంటెన్స్ గా ఉంది. ఆర్ట్ వర్క్, సినిమాటోగ్రఫీ పాకిస్తాన్ అండర్ వరల్డ్ వాతావరణాన్ని కళ్లకు కట్టినట్లు చూపించడంలో ముఖ్యపాత్ర పోషించాయి. కొంతవరకూ ప్రథమార్థం అంతా హంజా పాత్ర యొక్క ఎదుగుదల, ల్యారీ గ్యాంగ్ వార్లతో నిండిపోయి కాస్త నిదానంగా సాగినట్లు అనిపిస్తుంది. కానీ ద్వితీయార్థంలో వచ్చే ఇంటెలిజెన్స్ ఆపరేషన్లు, యాక్షన్ సన్నివేశాలు సినిమాను మరో స్థాయికి తీసుకెళ్ళాయి. రణ్‌వీర్ సింగ్ తన 'బీస్ట్ మోడ్' పర్ఫామెన్స్‌తో ఆకట్టుకోగా, మాధవన్ తన హుందాతనంతో అజయ్ సాన్యల్ పాత్రకు ప్రాణం పోశారు. సంజయ్ దత్, అర్జున్ రాంపాల్ ఇద్దరూ తమ నటనతో ఆకట్టుకున్నారు.

**సినిమాలో బాగోలేనివి ఇవీ:**
1. ప్రథమార్థంలో కొన్ని సాగతీత సన్నివేశాలు.
2. మితిమీరిన హింస

**ఇందులో ఏం బాగున్నాయో తెలుసా?**
1. రణ్‌వీర్ సింగ్ నటన 2. డైరెక్షన్
3. బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్,
4. సినిమాటోగ్రఫీ

**రేటింగ్: 3/5**

ఫైనల్ వర్డ్: పైసా వసూల్ యాక్షన్ థ్రిల్లర్

-నరేష్ , ముద్ర

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com